తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

జనంసాక్షి

www.janamsakshi.org

హైదరాబాద్ - రంగారెడ్డి

మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్

మంగళవారం
13 అక్టోబర్ 2026

పేజీలు : 08




# అవినీతిపరులకు అండ.. పార్టీకే గండం!

## ఆరోపణలపై మౌనమెందుకు?

- ప్రజల్లో పెరుగుతున్న అనుమానాలు
- నేతల వైఖరితోనే పార్టీ ప్రతిష్ఠ
- ఎన్నికల వేళ తప్పని ఎదురుదెబ్బ







**యాలాల, అక్టోబర్ 12 (జనంసాక్షి):**

**యాలాల మండలంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజకీయ నాయకులకు ఉన్నతస్థాయి నాయకుల అండదండలు ఉన్నాయా? అన్న చర్చ ప్రజల్లో మొదలవుతున్న వేళ, ఈ పరిణామం సంబంధిత వ్యక్తులకే కాకుండా పార్టీ ప్రతిష్ఠకు కూడా సవాలుగా మారుతోంది. ఆరోపణలు నిజమా కాదా అన్నది విచారణలో తేలాల్సిందే. అయితే, ఆరోపణలు వచ్చినప్పుడు వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత నాయకత్వంపై ఉంటుంది. వ్యక్తులపై మొదలైన ఆరోపణల చర్చ వారి వెనుక ఎవరున్నారనే ప్రశ్నకు దారితీస్తే, పార్టీ పెద్దలు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. రాజకీయాల్లో వైట్‌కాలర్ నాయకులకు ప్రత్యేక గుర్తింపు, సామాజిక గౌరవం, ప్రజల్లో మంచి పేరు ఉండవచ్చు. కానీ అవేవీ ప్రజల విశ్వాసానికి శాశ్వత హామీ కావు. పదవులు, పలుకుబడి, రాజకీయ పెద్దలతో సాన్నిహిత్యం కొంతకాలం రక్షణగా నిలిచినా, ప్రజల్లో ఏర్పడిన అనుమానాలను తొలగించలేవు. నాయకుడి అసలైన బలం అతని వెనుక ఉన్న రాజకీయ పెద్దలు కాదు.. అతనిపై ప్రజలకు ఉన్న నమ్మకం.**

### వ్యక్తుల తప్పిదాలకు పార్టీ మూల్యం చెల్లించాల్సిందే!

ఒక నాయకుడిపై వచ్చిన ఆరోపణలు వ్యక్తిగత వ్యవహారంగా మొదలైనా, ఆయనకు రాజకీయ అండదండలు ఉన్నాయనే భావన ప్రజల్లో ఏర్పడితే దాని ప్రభావం పార్టీ మొత్తం మీద పడుతుంది. ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై దృష్టి పెట్టాల్సిన నాయకత్వం ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులను సమర్థించుకోవడంలోనే సమయం గడపాల్సి వస్తే పార్టీకి నష్టమే. పార్టీ కోసం కష్టపడే కార్యకర్తల శ్రమకు, ప్రజల్లో పార్టీ సంపాదించుకున్న గుర్తింపునకు కూడా ఇది విఘాతం కలిగిస్తుంది.

ప్రభుత్వం ఎన్ని అభివృద్ధి పనులు చేపట్టినా, ఎన్ని సంక్షేమ పథకాలు అమలు చేసినా వాటిలో లోపాలు వెతికి విమర్శించేందుకు ప్రతిపక్షాలు సిద్ధంగా ఉంటాయి. అదే సమయంలో, అధికార పక్షానికి చెందిన నాయకుల వ్యవహారాల్లో అవినీతి ఆరోపణలు తెరపైకి వస్తే వాటిని రాజకీయంగా ఉపయోగించుకునే అవకాశాన్ని ప్రతిపక్షాల కు కల్పించినట్లవుతుంది. ఒకరి వ్యవహారం కారణంగా పార్టీ సాధించిన అభివృద్ధి పనులు పక్కకు వెళ్లి, ఆరోపణలే ప్రధాన చర్చగా మారితే నష్టపోయేది పార్టీనే.

అందుకే ఆరోపణలు వచ్చిన ప్రతిసారీ వాటిని రాజకీయ ప్రత్యర్థుల కుట్రగా కొట్టిపారేయడం ఎంతవరకు సమంజసమో, విచారణకు ముందే ఎవరినైనా దోషిగా చిత్రీకరించడం కూడా అంతే తప్పు. ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరిగేలా చూడటం, వాస్తవాలను ప్రజల ముందుంచడం బాధ్యతాయుతమైన నాయకత్వ లక్షణం. వ్యక్తుల పలుకుబడిని కాకుండా వారి వ్యవహారశైలిని, ప్రజల్లో ఉన్న అభిప్రాయాన్ని, పార్టీకి కలిగే ప్రయోజననష్టాలను నాయకత్వం పరిగణనలోకి తీసుకోవాలి.

### ప్రజాభిప్రాయాన్ని విస్మరిస్తే ప్రశ్నార్థకమే!

ప్రజలు నాయకులు ఏం మాట్లాడుతున్నారనే దానితో పాటు, ఏం చేస్తున్నారో, ఆరోపణలు ఎదురైనప్పుడు ఎలా స్పందిస్తున్నారో నిశితంగా గమనిస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో చూపే చొరవతోపాటు, తప్పు చేసినవారిపై చర్యలు తీసుకోవడంలో చూపే చిత్తశుద్ధి కూడా నాయకత్వానికి కొలమానంగా మారుతోంది. విమర్శలకు అవకాశం ఇవ్వకపోవడం కంటే, విమర్శలకు తావిచ్చే తప్పులు జరగకుండా చూడటమే రాజకీయ చతురతకు అసలైన నిదర్శనం.

రాబోయే రెండేళ్లలో ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రాజకీయ నాయకులు ఇప్పటి నుంచే తమ వ్యవహారశైలిని సమీక్షించుకోవాలి. గ్రామస్థాయిలో నాయకుల ప్రవర్తన, ప్రజలతో వారి సంబంధాలు, అవినీతి

లోపలి పేజీలో

## ఏఎస్‌రాజు నగర్‌లో ఎస్టిపి ప్లాంట్‌ను తనిఖీ చేసిన మియాపూర్ సర్కిల్ డిసి

**శేరిలింగంపల్లి, అక్టోబర్ 12 (జనంసాక్షి) :** మియాపూర్ సర్కిల్ పరిధిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రాధాన్యత క్రమంలో వాటిని పూర్తి చేయడం ద్వారా ప్రజలకు చేరువగా ఉండాలని మియాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఏఎస్ రాజు నగర్ మిత్ర పాంచజన్య లీటర్ కమ్యూనిటీ వద్దగల సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ టి పి ప్లాంట్ లో కొనసాగుతున్న మురుగు నీటిశుద్ధి విధానం, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్టిపి ప్లాంట్ వద్ద విధులను నిర్వర్తిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, అలసత్వానికి ఎట్టి పరిస్థితులలోను తావుండకూడదని ఆదేశాలను జారీ చేశారు. అనంతరం గురునాథం చెరువు వద్ద ఏర్పాటు చేసిన బతుకమ్మ కుంటను సర్కిల్ డిసి పరిశీలించడంతోపాటు అక్కడ చెత్తాచెదారాన్ని వీలైనంత త్వరగా తొలగించి బతుకమ్మ కుంటను శుభ్రపరిచి తిరిగి అందుబాటులోకి తీసుకురావాలని పారిశుద్ధ్య విభాగం అధికారులకు సూచించారు. ఏరోజుకారోజు బతుకమ్మ కుంటవద్ద తగిన సిబ్బందిని ఉంచడంతోపాటు నిమజ్జనానికి వచ్చే బతుకమ్మలను జాగ్రత్తగా నిమజ్జనం చేయడంతో పాటు అంతే బాధ్యతగా అందులోని పువ్వులను ఇతర సామాగ్రిని తొలగించి వేరుపరచడం ద్వారా సర్కిల్ అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప కమిషనర్ తోపాటు సర్కిల్ డిప్యూటీ ఈఈ, సానిటరీ సూపర్వైజర్, ఎస్ఆర్పి, స్థానిక సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొనడం జరిగింది.





# మట్టి దందా..

## ‘ఆదిభట్ల’లో ఆగదా?

- ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆదేశాలు బేకాతర్
- పట్టని రెవెన్యూ, మైనింగ్ అధికారులు
- కన్వెన్షన్ హాల్ కేంద్రంగా వందల టిప్పర్లల్లో యథేచ్ఛగా అక్రమ రవాణా

లోపలి పేజీలో

## తాండూరులో భారత్ మెటల్ ట్రేడర్స్ షాపును ప్రారంభించిన చీఫ్ విప్ డా. పట్నం మహేందర్ రెడ్డి




**తాండూరు ఆక్టోబర్ 12(జనంసాక్షి)** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చేనిమిళ్ల మల్లికార్జున్, ఎక్బల్ మాజీ కౌన్సిలర్ ఆహ్వానం మేరకు తాండూరు పట్టణంలోని గాంధీచౌక్ దగ్గర నూతనంగా ఏర్పాటు చేసిన భారత్ మెటల్ ట్రేడర్స్ షాపును తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.కొత్త వ్యాపారం ప్రారంభించిన మల్లికార్జున్ కి, ఎక్బల్ కి శుభాకాంక్షలు తెలిపారు. తాండూరులో వ్యాపార అభివృద్ధికి ఇలాంటి సంస్థలు ఎంతో అవసరం. వారి వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని కోరుకుంటున్నాను అని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీపీసీసీ ప్రచార కోఆర్డినేటర్ కరణం పురుషోత్తమ్ రావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పి. బస్వరాజ్, బీదర్ రాజశేఖర్, భగవాన్, నూర్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## మాద్వాపూర్ మెయిన్ రోడ్డు నుండి దర్గా మీదుగా గ్రామంలోకి వెల్లే మార్గంలో వీధి దీపాలు ఏర్నాటు



**బంట్వారం అక్టోబర్ 08 జనం సాక్షి::** బంట్వారం మండలం మాద్వాపూర్ గ్రామ సర్పంచ్ ఎండి గోరేమియా ఎన్నికలలో ఇచ్చిన హమి ప్రకారం గ్రామంలో అభివృద్ధికి పెద్ద పీఠ వేస్తున్నారు .గ్రామానికి అవసరమైన సదుపాయాలను సమకూరుస్తు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికి అందేలా చర్యలు తీసుకోవటం జరుగుతుంది.గ్రామ సమస్యలపై ఉన్నతాధికారులకు ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లి అవసరమైన నిధులను సమకూర్చేలా యత్నిస్తున్నారు. ఇలా ప్రజల కోసం పనిచేసే నాయకుడిని సర్పంచ్ గా ఎన్నుకోవటం పట్ల గ్రామస్తులు హర్శం వ్యక్తం చేస్తున్నారు. మెయిన్ రోడ్డు నుండి దర్గా మీదుగా గ్రామంలోకి వెల్లే మార్గంలో వీధి దీపాలు ఏర్నాటు చేయటం జరిగింది. గ్రామం మొత్తం వీధి లైట్లతో జిగేలు మనటం పట్ల గ్రామస్తులు హర్శం వ్యక్తం చేస్తున్నారు.గ్రామాభివృద్ధి విషయంలో రాజీ పడేది లేదని సర్పంచ్ గోరేమియా స్పష్టం చేశారు.

## సీఎస్ఆర్ కాలనీలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన

### కమ్యూనిటీ హాల్ ప్రారంభం

### ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవి రెడ్డి సుధీర్ రెడ్డి



**ఎల్బీనగర్ అక్టోబర్ 12 (జనం సాక్షి)** మన్సూరాబాద్ లెక్చరర్స్ కాలనీ డివిజన్ పరిధిలోని సీఎస్ఆర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. నూతనంగా నిర్మించిన కాలనీ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు.కమ్యూనిటీ హాల్ కోసం స్థలాన్ని దానం చేసిన చంద్రశేఖర్‌ను, సొంత నిధులతో భవనాన్ని నిర్మించుకున్న కాలనీ వాసులను అభినందించారు. కాలనీలో మిగిలిన డ్రైనేజీ, తాగునీరు, సీసీ రోడ్ల పనులను త్వరగా పూర్తి చేయాలని నివాసులు కోరగా, అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి మహిళా నాయకురాలు మల్లీశ్వరి, ఉద్యమకారుడు వెంకటరెడ్డి, నాయకులు చంద్రారెడ్డి, అనిల్‌కుమార్, కేకేఎల్ గౌడ్, నాగార్జున, కాలనీ అధ్యక్షుడు రజనీకాంత్, గౌరవ అధ్యక్షుడు సత్తిపండు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, నివాసులు తదితరులు పాల్గొన్నారు.

# 25 మందికి రూ.10.55 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

### భోలక్‌పూర్‌కు చెందిన లబ్ధిదారుడికి రూ.3 లక్షల ఎల్ఓసీ అందజేత



**అమీర్‌పేట్ (జనం సాక్షి):** ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఎవరూ మెరుగైన వైద్యానికి దూరం కాకూడదని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా ఆర్థిక సహాయం పొందుతూ మెరుగైన వైద్యం చేయించుకోవాలని సూచించారు.సోమవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో సనత్ నగర్ నియోజకవర్గ పరిధికి చెందిన 25 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.10.55 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను తలసాని పంపిణీ చేశారు. అలాగే భోలక్‌పూర్‌కు చెందిన రెడ్డి సోముకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.3 లక్షల ఆర్థిక సహాయానికి సంబంధించిన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసీ) పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది ఆర్థిక పరిస్థితులు అనుకూలించక వైద్యం విషయంలో నిర్లక్ష్యం చేస్తుంటారని అన్నారు. అలాంటి వారు ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకుని సకాలంలో మెరుగైన వైద్యం పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు నామన శేషుకుమారి, టి. మహేశ్వరి, కుర్మ హేమలత, అత్తిలి మల్లికార్జున్ గౌడ్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు కొలన్ బాల్ రెడ్డి, గుర్రం పవన్ కుమార్ గౌడ్, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, హన్మంతరావు, వెంకటేషన్ రాజు, తలసాని స్కైలాబ్ యాదవ్, టి. శ్రీహరి, అశోక్ యాదవ్, నామన సంతోష్ కుమార్, కిషోర్, నరేందర్, సురేష్ గౌడ్, ప్రవీణ్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, లక్ష్మీపతి, మహేందర్ గౌడ్, వెంకటరమణ, కూతురు నర్సింహ, కోటేశ్వర్ గౌడ్, కట్టా బలరాం, గోపిలాల్ చౌహన్, ప్రేమ్, అబ్బాస్, జమీర్, పురుషోత్తం, హరిసింగ్, దుర్గ, కౌసల్య, సీమ తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్‌లో తాగునీటి సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే చొరవ

### కొత్త పైప్‌లైన్ల ఏర్పాటుతో పాటు మెరుగైన నీటి సరఫరాకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచన



**ఉప్పల్, అక్టోబర్ 12 (జనం సాక్షి):** ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో నెలకొన్న తాగునీటి సమస్యల పరిష్కారానికి, ప్రజలకు మెరుగైన నీటి సరఫరా అందించేందుకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చొరవ తీసుకున్నారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో నీటి సరఫరాకు సంబంధించి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించడంతో పాటు, అవసరమైన ప్రాంతాల్లో కొత్త పైప్‌లైన్ల ఏర్పాటు అంశంపై సంబంధిత అధికారులతో చర్చించారు.ఈ సందర్భంగా జలమండలి ఈడీ పంకజ, జీఎం సంతోష్‌లను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కలిసి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో నెలకొన్న నీటి సరఫరా సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని కోరారు. నీటి సరఫరా సరిగా లేని ప్రాంతాలను గుర్తించి, సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.అలాగే, పెరుగుతున్న జనాభా, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అవసరమైన ప్రాంతాల్లో కొత్త పైప్‌లైన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఇప్పటికే నీటి సమస్యలు ఎదుర్కొంటున్న ప్రాంతాల్లో సరఫరాను మెరుగుపరిచేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. తాగునీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి, ప్రజలకు సకాలంలో నీరు అందేలా చూడాలని సూచించారు.నియోజకవర్గ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో భాగంగా తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా నీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరిచేందుకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని తెలిపారు.

## 15 ఏళ్లుగా తాళాలకే పరిమితమైన సమావేశ మందిరం

### అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని స్థానికుల విజ్ఞప్తి



**బంట్వారం అక్టోబర్ 09 జనం సాక్షి.** :ప్రజలకు ప్రజాప్రతినిధులకు ఉపయోగపడేలా నిర్మించిన ప్రభుత్వ భవనం ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉండటం పట్ల బంట్వారం మండల కేంద్రంలోని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో నిర్మించిన మీటింగ్ హాల్ సుమారు 15 ఏళ్లు గడిచినా పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాకపోవడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. 2011లో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనిశ్రీమతి పట్నం మనీతా మహేందర్ రెడ్డి మీటింగ్ హాల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నిర్మాణం పూర్తయినప్పటికీ నేటికీ ప్రజలకు అందుబాటులోకి రాకపోవడంతో ప్రభుత్వ నిధులతో నిర్మించిన భవనం లక్ష్యం నెరవేరడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రజా సమస్యలపైసమావేశాలు, గ్రామాభివృద్ధి కార్యక్రమాలు, అధికారిక సమావేశాలు నిర్వహించేందుకు ఉపయోగపడాల్సిన భవనం ఏళ్ల తరబడి తాళాలకే పరిమితం కావడంతో నిర్వహణ లేక పరిసరాలు సైతం నిర్లక్ష్యానికి గురవుతున్నాయని వారు తెలిపారు.తక్షణమే వినియోగంలోకి తేవాలిసంబంధిత అధికారులు మీటింగ్ హాలు పరిశీలించి అవసరమైన మరమ్మతులు, విద్యుత్, తాగునీరు, ఫర్నిచర్ తదితర సదుపాయాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజా అవసరాల కోసం నిర్మించిన భవనం నిరుపయోగంగా ఉండకుండా వెంటనే వినియోగంలోకి తీసుకువచ్చి ప్రజా సమావేశాలు, గ్రామాభివృద్ధి కార్యక్రమాలకు అందుబాటులోకి తేవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం



**మల్కాజిగిరి అక్టోబర్ 12 (జనంసాక్షి)**నేరెడ్‌మెట్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ఏళ్ల తరబడి వేధిస్తున్న మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు చేపట్టారు. కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు, మురుగునీటి కాలువలు తరచూ పొంగిపొర్లుతున్న ప్రాంతాలను గుర్తించి, వాటి స్థానంలో నూతన డ్రైనేజీ పైప్‌లైన్లు ఏర్పాటు చేసేందుకు జలమండలి సైనిక్‌పురి మేనేజర్ సాయిబాబాతో కలిసి స్థానిక సీనియర్ కాంగ్రెస్ నాయకులు కాలనీలలో పర్యటించారు .మురుగునీరు నిలవకుండా కొత్త పైప్‌లైన్ల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేస్తామన్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా త్వరితగతిన ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా జలమండలి మేనేజర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొత్తపల్లి ఉపేందర్‌రెడ్డి, ఎస్.ఆర్. ప్రసాద్, డివిజన్ అధ్యక్షుడు రాఘవన్, ఈశ్వర్, శ్యామ్, శ్రీనివాస్, సన్నీ, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

# కంది సాగుపై శిక్షణ




**షాబాద్, అక్టోబర్ 12(జనం సాక్షి);** కంది పంట సాగులో శాస్త్రీయ పద్ధతుల అమలు ద్వారా ఉత్పాదకత పెంపొందుతుందని మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర పేర్కొన్నారు. మిషన్ ఫర్ ఆత్మ నిర్భరత ఇన్ పల్సస్ 2026-27 పథకం కింద సోమవారం కందుల పంట బ్లాక్ డైమండ్ స్టేషన్లపై శిక్షణ కార్యక్రమం, మరియు క్షేత్ర సందర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు మల్కాపురం పెంటయ్య, బందెయ్య, షాబాద్ రైతు ఫుడ్ ఫార్మర్ ప్రొడ్యూసర్ సీఈవో చంద్రశేఖర్ రెడ్డి, రైతులు యట్టయ్య, మల్లేష్, జంగయ్య, వెంకటయ్య గౌడ్, యాదగిరి, మహేశ్వర్ రెడ్డి, పాండయ్య, రాజేందర్ రెడ్డి,వ్యవసాయ విస్తరణ అధికారులు శివతేజ,ఉద్యాన విస్తరణ అధికారి బలరాం తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక హక్కుల పరిరక్షణకై పోరాడే ఏకైక సంఘం ఏఐటీయూసీ

- ఫ్యూచర్ సిటీ ప్రాంతంలో వలస కార్మికుల సమస్యలపై భవిష్యత్తులో విస్తృత ఉద్యమాలు
- కందుకూరు మండల కేంద్రంలో ఏఐటీయూసీ నూతన కార్యాలయం ప్రారంభం




**కందుకూరు,అక్టోబర్ 12(జనం సాక్షి):**దేశంలో కార్మిక హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడే ఏకైక కార్మిక సంఘం ఏఐటీయూసీ (కూనఖజ) అని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహ స్పష్టం చేశారు. కొమ్మగళ్ల రాజు ఆధ్వర్యంలో కందుకూరు మండల కేంద్రంలో సోమవారం నూతన ఏఐటీయూసీ కార్యాలయాన్ని రాష్ట్ర కార్యదర్శి పానుగంటి పర్వతాలు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి. దత్తు నాయక్‌లతో కలిసి ఎం. నరసింహాలాంఛనంగా ప్రారంభించారు.అనంతరం రాష్ట్ర కార్యదర్శి ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో నాయకులుమాట్లాడుతూ... కార్మికులకు కనీస వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్ చట్టాల పక్కా అమలు కోసం ఏఐటీయూసీ ఎల్లప్పుడూ ముందుండి పోరాడుతుందని తెలిపారు. ఫ్యూచర్ సిటీ పరిధిలోని కందుకూరు ప్రాంతం దినదినాభివృద్ధి చెందుతోందని, ఇక్కడ బహుళ అంతస్తుల నిర్మాణాలు, అంతర్జాతీయ పరిశ్రమలు పెద్దఎత్తున వస్తున్నందున వలస కార్మికుల సంఖ్య గణనీయంగాపెరిగిందన్నారు. ఈ ప్రాంతంలో వలస కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి స్థానిక ఏఐటీయూసీ నాయకత్వం నిరంతరం అందుబాటులో ఉంటూ ఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. నూతనంగా ప్రారంభించిన కార్యాలయం కార్మికుల హక్కుల పోరాటానికి కేంద్ర బిందువుగా మారాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బి. దత్తు నాయక్, జిల్లా కార్యవర్గ సభ్యులు దేవేందర్ గౌడ్, ఏఐటీయూసీ కందుకూరు మండల అధ్యక్ష, కార్యదర్శులు యాదగిరి, ప్రవీణ్, నాయకులు బ్రహ్మచారి, రవన్న, జంగయ్య, సాంసంగ్ పప్పు, శివ, రాజు, రమేష్, రాకేష్, కవిత, శాంతి తదితరులు పాల్గొన్నారు.

## బేటీ బచావో అంటూనే బేటీలను వేధించినోడికి పదవా

**మహిళలపై వేధింపులకు పాల్పడిన కాంగ్రెస్ ఎంపీని వెంటనే తొలగించాలి**

### మాజీ కౌన్సిలర్ సాహు శ్రీలత డిమాండ్





**తాండూరు, అక్టోబర్ 12 (జనంసాక్షి).** మణిపూర్ కాంగ్రెస్ ఎంపీ విమల్ జేవిన్ యు లో పనిచేస్తూ అక్కడ ఉన్న 11 మంది విద్యార్థులపై లైంగిక వేధింపులకు గురి చేశారని, ఆ కారణంగా అక్కడి యాజమాన్యం ఆయన్ని సస్పెండ్ చేసిందని మాజీ కౌన్సిలర్ సాహు శ్రీలత ఆరోపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జేఎన్ యు యాజమాన్యమే సస్పెండ్ చేసినా కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇది కాంగ్రెస్ పార్టీ మహిళల పట్ల చూపుతున్న నిర్లక్ష్యానికి నిదర్శనం. మహిళల పట్ల జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించడానికి వెళ్తుంటే ముందస్తు అరెస్టులు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం అని విమర్శించారు. పదవిలోంచి తొలగించకపోతే కచ్చితంగా మరింత పెద్ద ఎత్తున మహిళా మోర్చా రాష్ట్ర పార్టీ ఆధ్వర్యంలో అలుపెరుగని పోరాటం చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామని సాహు శ్రీలత అన్నారు.

## శ్రమదానంతో ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు

### చింతకుంట అభివృద్ధికి వెంటనే టెండర్లు పిలవాలని జోనల్ కమిషనర్ ఆదేశాలు



**రాజేంద్రనగర్,అక్టోబర్12(జనంసాక్షి)**అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని రాధాకృష్ణ నగర్, కాంతారెడ్డి నగర్ మధ్య ఉన్న చింతకుంట పార్కులో శనివారం వాకర్స్ శ్రమదానంతో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో వాకర్స్ పాల్గొనగా, జీహెచ్ఎంసీ పారిశుధ్య సిబ్బంది సహకరించారు. మరోవైపు, చింతకుంటలో అభివృద్ధి కార్యక్రమాలకు వెంటనే టెండర్లు పిలవాలని జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఒకప్పుడు మురికికుంటగా ఉన్న చింతకుంట ప్రస్తుతం వలస పక్షులకు ఆవాసంగా మారిందని, నీటి సంరక్షణకు అందరూ సహకరించాలని వాకర్స్ కోరారు. చింతకుంటను పర్యావరణహిత సహజ పార్కుగా తీర్చిదిద్దేందుకు అధికారులు చర్యలు వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిఈ నరేందర్ గౌడ్,స్థానిక నాయకులు మల్లారెడ్డి, విజయ్ కుమార్, సీనియర్ జర్నలిస్ట్ మాద్యం మధుకాలనీవాసులు పాల్గొన్నారు.

# కాకతీయ నగర్, జేఎస్ఎన్ కాలనీల్లో కొత్త రోడ్లకు వినతి



### ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేత

### త్వరలో పనులు చేపడతామని హామీ

**ఉప్పల్, అక్టోబర్ 12 (జనం సాక్షి):** హబ్సీగూడ డివిజన్ పరిధిలోని రోడ్ నంబర్ 2 కాకతీయ నగర్, జేఎస్ఎన్ కాలనీ ఈస్ట్‌లో నెలకొన్న రోడ్ల సమస్యను పరిష్కరించి, కొత్త రోడ్లు మంజూరు చేయాలని కోరుతూ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో హబ్సీగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కంది శ్రవణ్ కుమార్ రెడ్డి సోమవారం ఎంఎంసీ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి కాలనీల సమస్యలను వివరించారు.కాకతీయ నగర్, జేఎస్ఎన్ కాలనీ ఈస్ట్‌లో రోడ్ల సమస్యతో స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. కాకతీయ నగర్, జేఎస్ఎన్ కాలనీ ఈస్ట్‌లో రోడ్ల కాలనీల్లో రోడ్ల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేసి, కొత్త రోడ్ల నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రోడ్ల పరిస్థితి కారణంగా స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిగణనలోకి తీసుకుని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు.వినతిపత్రంపై కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. సమస్యలను పరిశీలించి, త్వరలోనే నిధుల మంజూరుకు చర్యలు తీసుకోవడంతో పాటు టెండర్ల ప్రక్రియ ప్రారంభించి పనులు చేపడతామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.కాలనీల్లో రోడ్ల సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుని, అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లిన మందుముల పరమేశ్వర్ రెడ్డి, కంది శ్రవణ్ కుమార్ రెడ్డిలకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఏ బ్లాక్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతల బాబురావుతో పాటు హబ్సీగూడకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## లక్ష్మీనగర్ కాలనీలో ఓపెన్ జిమ్ ప్రారంభించిన ఎమ్మెల్యే



**రాజేంద్రనగర్,అక్టోబర్12(జనంసాక్షి)** అత్తాపూర్ సర్కిల్ హైదర్గూడా డివిజన్ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీ పార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్, బ్యాడ్మింటన్ కోర్టు, చిన్నారుల ఆట వస్తువులను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్, హైదర్గూడా కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు సామ ఇంద్రపాల్ రెడ్డి, స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ప్రజల ఆరోగ్యం, చిన్నారుల వినోదం కోసం ఈ సదుపాయాలను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

### యాలాల ఎస్ఐ విఠల్ రెడ్డి




**యాలాల, అక్టోబర్ 12 ( జనం సాక్షి ) :** దేవీ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని యాలాల ఎస్ఐ విఠల్ రెడ్డి సూచించారు. ఉత్సవాల సందర్భంగా నిర్వాహకులు పోలీసులకు సహకరిస్తూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడవద్దని కోరారు. నిబంధనలు పాటిస్తూ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ విఠల్ రెడ్డి సూచించారు.

## సనత్ నగర్‌లో బతుకమ్మ వేడుకలు నిర్వహించాలి

### బీఆర్ఎస్ నాయకులకు మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచన



**అమీర్‌పేట్ (జనం సాక్షి):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఈ నెల 14 నుంచి సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించనున్న బతుకమ్మ వేడుకల ఏర్పాట్లపై బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. 17న అమీర్‌పేట డివిజన్‌లోని బల్కంపేట ఆలయం వద్ద, బేగంపేట డివిజన్‌లోని పాటిగడ్డలో, మోండా డివిజన్‌లోని జీఆర్సీ గ్రౌండ్‌లో బతుకమ్మ సంబరాలు జరగనున్నాయని పేర్కొన్నారు. 18న సనత్ నగర్‌లోని హనుమాన్ (సెవెన్ టెంపుల్స్) దేవాలయం, జెకే కాలనీ, బతుకమ్మ చౌరస్తా వద్ద వేడుకలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

# బతుకమ్మ ఘాట్ ఏర్పాటు చేయాలి

### మాజీ కార్పొరేటర్ శాంతి



**అల్వాల్, అక్టోబరు 12 (జనం సాక్షి):**సద్దుల బతుకమ్మ సందర్భంగా చిన్నరాయుని చెరువు సమీపంలో తాత్కాలిక బతుకమ్మ ఘాట్ ఏర్పాటు చేయడంతోపాటు, కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలని మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి డీసీ భోగేశ్వర్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో సాజిద్, మహేందర్, శోభన్, బాలయ్యలతో కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీల్లో వీధి దీపాల సమస్యలను పరిష్కరించాలని, గంగపుత్ర కాలనీ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను పూర్తి చేయాలని, బీహెచ్ఈఎల్ కాలనీలో రహదారి పనులు చేపట్టాలని వినతిపత్రంలో కోరారు. సద్దుల బతుకమ్మ వేడుకలకు వచ్చే మహిళలకు ఇబ్బందులు కలగకుండా తాత్కాలిక ఘాట్ వద్ద అవసరమైన సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

# ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ నిరసన



**మల్కాజిగిరి అక్టోబర్ 12 (జనం సాక్షి)**ఓట్ల తొలగింపు ప్రక్రియను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆనంద్‌బాగ్‌లో సోమవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి లక్ష్మీకాంతరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పార్టీ కండువాలు, జెండాలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీకాంతరెడ్డి మాట్లాడుతూ. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ పిలుపు మేరకు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆదేశాలతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ సూచనల ప్రకారం అక్రమంగా ఓట్లు తొలగించిన ప్రతి ఓటరుకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఎస్‌ఐఆర్ ప్రక్రియలో జరిగిన అక్రమాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఉద్యమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. ఇందులో భాగంగా బుధవారం మల్కాజిగిరి గాంధీపార్క్‌లో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్ యాదవ్, గుండా నిరంజన్, జివిన్వి సతీశ్ కుమార్, పిట్టల శ్రీనివాస్, ఎ.కె. మురుగేశ్,జీడి సంపత్ గౌడ్, వినోద్ యాదవ్, సత్యమూర్తి, వైనాల ప్రవీణ్, యూసుఫ్ భాయ్, పిట్టల నాగరాజు, శ్రీకాంత్ ముదిరాజ్, రాందాస్, సంతోష్ ముదిరాజ్, చెన్నారెడ్డి, పార్థు, జీడి చరణ్‌జిత్ గౌడ్, నాయకురాళ్లు ఆశా, చిత్ర, శారద, పుష్పలత, కనకలక్ష్మి, లక్ష్మి, నాయకులు గోకుల్, సయ్యద్ మబ్బు, బ్రహ్మయ్య, రామకృష్ణ, రాము, చుంకు శ్రీనివాస్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిపై రియల్ 'మాఫియా' పంజా

- తుర్కయాంజాల్ సర్వే నెం. 212 లో కబ్జా
- కళ్లముందే కబ్జాలు మౌనంలో అధికారులు
- ఏరియల్ సర్వే చేసి ఆక్రమణలు తేల్చాలి
- ప్రజావాణిలో సీపీఎం భారీ ధర్నా



**రంగారెడ్డి, అక్టోబర్ 12 (జనంసాక్షి):**రంగారెడ్డి జిల్లా తుర్కయాంజాల్ రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు పరాకాష్టకు చేరాయి. సర్కారు రికార్డుల్లో స్పష్టంగా 'అసైన్మెంట్ భూమి' అని ఉన్న సర్వే నంబర్ 212 లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు యథేచ్ఛగా కబ్జాలకు పాల్పడుతుంటే, సంబంధిత అధికారులు మౌన ప్రేక్షకులుగా మారారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ అక్రమాలకు నిరసనగా, ప్రభుత్వ భూములను కాపాడాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్ట్ పార్టీ (మార్క్సిస్ట్) సీపీఎం తుర్కయంజాల్ మున్సిపల్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగాసీపీఎం మున్సిపల్ కమిటీ సభ్యులు మండల సత్యనారాయణ మాట్లాడుతూ.. సర్వే నంబర్ 212 లోని ప్రభుత్వ భూమిని మానేపల్లి కన్స్ట్రక్షన్స్, ఇతర రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా దురాక్రమణ చేశారన్నారు. చట్టాలు, నిబంధనలను బొందపెట్టి చెరువు కట్ట కింద ఉన్న సున్నితమైన ప్రాంతంలో బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారని ఆరోపించారు.ప్రభుత్వ భూమిలో, చెరువు కట్ట కింద సరైన పునాదులు లేకుండా నిర్మిస్తున్న ఈ భారీ భవనాలు భవిష్యత్తులో కూలిపోయే ప్రమాదం చాలా ఎక్కువగా ఉందన్నారు. వర్షాలు వచ్చినప్పుడు చెరువు కట్ట తెగిపోతే చుట్టుపక్కల నివసించే వేలాది మంది ప్రజల ప్రాణాలు, ఆస్తులు ప్రమాదం పొంచి ఉందన్నారు. స్థానిక రెవెన్యూ అధికారులు ఈ అక్రమ నిర్మాణాలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనుక పెద్ద ఎత్తున ఒత్తిళ్లు ఉన్నాయనే అనుమానాలను వ్యక్తం చేశారు. అధికారులు స్పందించకపోవడంతోనే అక్రమార్కులు రెచ్చిపోతున్నారని దుయ్యబట్టారు. సర్వే నంబర్ 212 లోని భూమిని వెంటనే డ్రోన్/ఏరియల్ సర్వే మరియు ఫిజికల్ సర్వే చేయించి కచ్చితమైన సరిహద్దులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ భూమి అయినప్పటికీ సెక్షన్ 22-ఏ లో ఎందుకు చేర్చలేదని ప్రశ్నించారు. ఈ అక్రమ నిర్మాణాలకు జరుగుతున్న రిజిస్ట్రేషన్లను, ప్లాన్ అనుమతులను తక్షణమే నిలిపివేసి రద్దు చేయాలన్నారు. సర్కారు భూమిని కబ్జా చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి విచారణ జరిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఇల్లూరి భాస్కర్, కె. వెంకటకృష్ణ, సుందరయ్య నగర్ శాఖ కార్యదర్శి ఐతరాజు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మిర్జాగూడ గేట్ సమీపంలో మహిళపై పదునైన ఆయుధంతో దాడి

**తలకు తీవ్ర రక్తగాయాలు.. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు**



**చేవెళ్ల, అక్టోబర్ 12 (జనంసాక్షి)** చేవెళ్ల--వికారాబాద్ ప్రధాన రహదారిపై మిర్జాగూడ గేట్ సమీపంలోని పొలంలో గుర్తుతెలియని మహిళ రక్తగాయాలతో పడి ఉన్న ఘటన సోమవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. గుర్తుతెలియని వ్యక్తులు పదునైన ఆయుధంతో దాడి చేయడంతో ఆమె తలకు గాయాలైనట్లు బాధితురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం సుమారు 6 గంటల సమయంలో పర్వేద శంకరయ్య 100 డయల్‌కు ఫోన్ చేసి మిర్జాగూడ గేట్ వద్ద ఓ మహిళ రక్తగాయాలతో పడి ఉన్నట్లు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన పెట్రోలింగ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. చేవెళ్ల నుంచి వికారాబాద్ వెళ్లే మార్గంలో మిర్జాగూడ గ్రామ పరిధిలోని గేట్‌కు ఎడమవైపు సుమారు 100 మీటర్ల దూరంలోని పొలంలో మహిళ రక్తగాయాలతో పడి ఉండటాన్ని గుర్తించారు. వెంటనే ఆమెను చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అనంతరం మెరుగైన చికిత్స కోసం పట్టణంలోని మహేందర్ ఆసుపత్రిలో చేర్పించారు. బాధితురాలిని హఫీజ్‌పేట్‌లోని ప్రేమ్‌నగర్ కాలనీకి చెందిన కల్సాని వీణ (26)గా గుర్తించారు. విచారణలో భాగంగా బాధితురాలి తండ్రి కల్సాని ఇంద్రారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వీణ అక్టోబర్ 3న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆమెపై పదునైన ఆయుధంతో దాడి చేసి తలకు గాయాలు చేసినట్లు ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై చేవెళ్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధితురాలు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. దాడికి పాల్పడిన వారిని గుర్తించేందుకు పోలీసులు విచారణ చేపట్టారు.

# వికలాంగుల పునరావాస కేంద్రంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



**కొడంగల్, అక్టోబర్ 12 (జనం సాక్షి):**వికారాబాద్ జిల్లా కొడంగల్ మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో వికలాంగుల పునరావాస కేంద్రం ఆవరణలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, ఆటపాటలతో సందడి చేశారు. బతుకమ్మ పాటలు పాడుతూ, బొడ్డెమ్మ ఆటలతో వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య సిబ్బంది, పాల్గొన్నారు.

## ఏపీఎల్‌లో చేరో ఆర్చర్స్ ఘన విజయం



**ఖైరతాబాద్, అక్టోబర్ 12 (జనం సాక్షి) :** ఆర్చరీ ప్రీమియర్ లీగ్(ఏపీఎల్) రెండో సీజన్‌లో చేరో ఆర్చర్స్ 6-0తో కాకతీయ నైట్స్‌ను ఓడించింది. పీపుల్స్ ప్లాజాలో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో కెప్టెన్ అతాను దాస్, డెన్మార్క్‌కు చెందిన వరల్డ్ నంబర్ వన్ కాంపౌండ్ ఆర్చర్ మథియాస్ ఫుల్లర్టన్, కేసీ కాఫ్‌హోల్డ్ కీలకంగా రాణించారు. ఆరు బాణాలతో 59 పాయింట్లు సాధించిన ఫుల్లర్టన్ టాప్ స్కోరర్‌గా నిలిచాడు. కాకతీయ నైట్స్ తరఫున ఆస్ట్రియా కాంపౌండ్ స్టార్ నికో వీనర్ స్థానంలో బరిలోకి దిగిన శివశంకర్ ల్యాండ్‌కర్, వెన్నం జ్యోతి సురేఖ ఆకట్టుకున్నా జట్టును గెలిపించలేక పోయారు. తొలి సెట్‌లో 70కి 69 పాయింట్లు సాధించిన చేరో, రెండో సెట్‌లో అతాను దాస్ పర్ఫెక్ట్ ఎక్స్ రింగ్ పాయింట్‌తో 4-0 ఆధిక్యంలోకి వెళ్లింది. మూడో సెట్‌లో అతాను దాస్, కేసీ కాఫ్‌హోల్డ్ ఒత్తిడిలోనూ 10 పాయింట్ల బాణాలు సంధించి విజయాన్ని ఖాయం చేశారు. నాలుగు మ్యాచ్‌ల్లో మూడు విజయాలతో చేరో ఆర్చర్స్ ముందంజలో ఉండగా, కాకతీయ నైట్స్ రెండు విజయాలు, రెండు ఓటములు నమోదు చేసింది.

## అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ జన్మదిన వేడుకలు



**కొడంగల్, అక్టోబర్ 12 (జనం సాక్షి):**అంబేద్కర్ సంఘం కొడంగల్ నియోజకవర్గ అధ్యక్షుడు రేగడి మైలారం శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎస్. సోమశేఖర్ ఆయనను శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శ్రీనివాస్ ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకుంటూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. వారితో పాటు బండమీదిపల్లి సర్పంచ్ మల్లేశం,యశ్వంత్ ఉన్నారు.

## వివేక్ నగర్ హనుమాన్ ఆలయంలో వైభవంగా నవరాత్రి ఉత్సవాలు

**పాల్గొని అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్**





**ముషీరాబాద్ అక్టోబర్ 12 (జనం సాక్షి):** నగరంలోని వివేక్ నగర్‌లో ప్రసిద్ధి చెందిన హనుమాన్ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. నవరాత్రుల రెండో రోజు సందర్భంగా ఆలయంలో ప్రత్యేక చండీ యాగం, హోమం నిర్వహి ంచారు. వేద మంత్రోచ్ఛా రణలు, ప్రత్యేక పూజల మధ్య జరిగిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ముషీరాబాద్ శాసనసభ్యులు ముఠా గోపాల్ ఆలయాన్ని సందర్శించి, ప్రత్యేక చండీయాగం, హోమంలో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలు భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు, యాగ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందుతున్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఎం. రాకేష్ కుమార్, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, పద్మ దంపతులు, పోతుల శ్రీకాంత్, ఆలయ మాజీ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, ఎర్రం శ్రీనివాస్ గుప్తా, పున్న సత్యనారాయణ, వంశీ, ఆలయ ఈవో కొమ్మాలు, ఆలయ పేద పండితులు బుగ్గ లక్ష్మీపతి శర్మ, కందల వెంకటాద్రి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# కొత్త జిల్లాల ఏర్పాటు కేసీఆర్ దూరదృష్టికి నిదర్శనం

## కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

## నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి శ్రీశైల్ రెడ్డి



**తాండూరు, అక్టోబర్ 12(జనంసాక్షి)** ప్రజలకు పాలనను చేరువ చేయాలనే లక్ష్యంతో కేసీఆర్ చేపట్టిన కొత్త జిల్లాల ఏర్పాటు తెలంగాణ చరిత్రలో కీలక నిర్ణయం. ప్రజల సౌలభ్యం కోసం తీసుకున్న ఈ నిర్ణయం ఆయన దూరదృష్టికి నిదర్శనమని తాండూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి శ్రీశైల్ రెడ్డి అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కొత్త జిల్లాలు ఏర్పాటు జరిగి పదేళ్ల పూర్తయిన సందర్భంగా సోమవారం వికారాబాద్‌లోని ఎన్టీఆర్ చౌరస్తాలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు చిత్రపటానికి మాజీ మంత్రి, చేవెళ్ల ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, శ్రీశైల్ రెడ్డి క్షీరాభిషేకం చేశారు.ఈ కార్యక్రమానికి తాండూర్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి పిలుపు మేరకు తాండూర్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.ఈ సందర్భంగా శ్రీశైల్ రెడ్డి మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంలోనే కాకుండా, రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేయడంలోనూ కేసీఆర్ కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ప్రజలు తమ ప్రభుత్వ పనుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, పాలనను ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో కొత్త జిల్లాలను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో పరిపాలనా సౌలభ్యం పెరిగిందని, ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యాయని, తెలంగాణ ప్రజల అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగా కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలు చిరస్మరణీయమన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటు జరిగి పదేళ్లు పూర్తయిన సందర్భంగా కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తాండూర్ నియోజకవర్గంలోని అన్ని మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు, కార్యదర్శులు, కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు, సీనియర్ నాయకులు, బీఆరెస్ పార్టీ పలువురు సర్పంచులు, మాజీ సర్పంచులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పెండింగ్‌లో ఉన్న మంచినీటి పైప్‌లైన్, డ్రైనేజీ పనులు త్వరగా పూర్తి చేయాలి

## జలమండలి సీజీఎం ను కోరిన కళ్లెం నవజీవన్ రెడ్డి



**హయత్‌నగర్, అక్టోబర్ 12 (జనం సాక్షి)**ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న మంచినీటి పైప్‌లైన్, భూగర్భ డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతూ హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి జలమండలి సీజీఎం నాగేంద్రబాబును ఆయన కార్యాలయంలో కలిసి కోరారు. ఈ సందర్భంగా వివిధ కాలనీల్లో పైప్‌లైన్, డ్రైనేజీ పనులు పూర్తికాకపోవడంతో స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పనులు పెండింగ్‌లో ఉండటం వల్ల ప్రజలకు అసౌకర్యం కలుగుతోందని, సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పనులను త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మంచినీటి పైప్‌లైన్, భూగర్భ డ్రైనేజీ పనులను సకాలంలో పూర్తి చేసి, స్థానిక సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. దీనిపై జలమండలి అధికారులు సానుకూలంగా స్పందించి, పెండింగ్ పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తూ, హయత్‌నగర్ డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని కళ్లెం నవజీవన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

# టీజీవోస్ బతుకమ్మ సంబరాలకు

## మహిళా ఐఏఎస్ అధికారులకు ఆహ్వానం



**హైదరాబాద్ సిటీ, అక్టోబర్ 12 (జనం సాక్షి) :** బతుకమ్మ సంబరాలలో భాగంగా ఈ నెల 14న నాంపల్లిలోని టీజీవోస్ భవన్‌లో నిర్వహించనున్న టీజీవోస్ బతుకమ్మ వేడుకలకు మహిళా ఐఏఎస్ అధికారులను ఆహ్వానించారు.స్పెషల్ చీఫ్ సెక్రటరీ వాణి ప్రసాద్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా, స్పెషల్ సెక్రటరీ(ఫైనాన్స్) సిక్తా పట్నాయక్‌లను టీజీవోస్ ప్రతినిధులను ఆహ్వానించారు. టీజీవోస్ సెంట్రల్ అసోసియేషన్ మహిళా విభాగం చైర్‌పర్సన్ డాక్టర్ దీపా రెడ్డి, కన్వీనర్ సెక్రటరీ జె.సుజాత, సెంట్రల్ అసోసియేషన్ సెక్రటరీ శిరీష, చైర్‌పర్సన్ అనిత, మమత, వందన, జయశ్రీ, సరస్వతి, రూప్నీ, కీర్తి తదితరులతో పాటు అశన్న, రాజేందర్, వెంకట్ రామారెడ్డి పాల్గొన్నారు. టీజీవో హైదరాబాద్ అధ్యక్షుడు కృష్ణ యాదవ్, హైదరాబాద్ సిటీ అధ్యక్షుడు వెంకట్ గందూరి ఆధ్వర్యంలో ఈ ఆహ్వాన కార్యక్రమం జరిగింది.

## కిషన్‌గూడ ఫ్లైవోవర్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతి



**శంషాబాద్,అక్టోబర్12(జనంసాక్షి)**శంషాబాద్ లోనికిషన్‌గూడ ఫ్లైవోవర్‌పై 50--55 ఏళ్ల వయసున్న గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని శంషాబాద్ పోలీసులు గుర్తించారు. మృతుడు గత కొన్ని నెలలుగా శంషాబాద్ పరిసరాల్లో భిక్షాటన చేస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉండగా, వ్యక్తి వివరాలు గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# టీజీపీసీబీలో ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

## రెండో రోజు గాయత్రీ దేవి అవతారంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు



**అమీర్‌పేట్ /సనత్‌నగర్, అక్టోబర్ 12 (జనం సాక్షి):** తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ)లో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం గాయత్రీ దేవి అవతారంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు.టీజీపీసీబీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో తొమ్మిది రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో భాగంగా సభ్య కార్యదర్శి జి. రవి, అధికారులు, సిబ్బంది ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో అమ్మవారికి పూజలు చేశారు. అర్చకులు శేషాచలం ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా కుంకుమ పూజ నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి, ప్రసాదాన్ని అందరికీ పంపిణీ చేశారు. అధికారులు, ఉద్యోగులు అమ్మవారి ఆశీస్సులు పొందుతూ భక్తిశ్రద్ధలతో వేడుకల్లో పాల్గొన్నారు.ఈ ఉత్సవాలు కార్యాలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపాయి. ఐక్యత, సాంస్కృతిక సంప్రదాయాలు, దైవిక శక్తి పట్ల భక్తిభావాన్ని చాటిచెప్పేలా వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ బి. రఘు, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీవాత్సవ, ప్రధాన కార్యదర్శి డి. కృపానంద్, సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ శకుంతల, చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ వినయ్ కుమార్ నాయుడు, ఎన్విరాన్‌మెంటల్ సైంటిస్ట్ డాక్టర్ జె. సుమతి, పరిపాలనా అధికారి అరుణ, సి. రాజేష్, ఎ. రాజేష్‌తో పాటు పలువురు అధికారులు, ఉద్యోగులు, మహిళా సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కోట్పల్లి మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గానికి అభినందనలు

## ప్రభుత్వ చీఫ్ విప్ డా. పట్నం మహేందర్ రెడ్డి



**తాండూరు అక్టోబర్ 12(జనంసాక్షి)** కోట్ పల్లి మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గం చైర్మన్ గా నియమితులైన అనితా బాయి రమేష్ నాయక్, వైస్ చైర్మన్ మధులత శ్రీనివాస్ లను శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అభినందించారు.ఈ సందర్భంగా చైర్మన్, వైస్ చైర్మన్ లు ఈ నెల 14న నిర్వహించే ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా మహేందర్ రెడ్డి ని ఆహ్వానించారు.అనంతరం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన చైర్మన్ అనితా బాయి రమేష్ నాయక్, వైస్ చైర్మన్ మధులత శ్రీనివాస్ లకు హృదయపూర్వక శుభాకాంక్షలు. మార్కెట్ అభివృద్ధికి స్థానిక నేతలు, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తో పాటు తన వంతుగా పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. అనంతరం వైస్ చైర్మన్ మధులత శ్రీనివాస్, రమేష్ నాయక్ లకు మిఠాయి తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కరణం పురుషోత్తం రావు, బీదర్ శేఖర్, దస్తప్ప తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్ నగర్ కాలనీలో మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డికి ఘన సన్మానం



**హయత్‌నగర్, అక్టోబర్ 12 (జనం సాక్షి)**హయత్ నగర్ డివిజన్ పరిధిలోని హనుమాన్ నగర్ కాలనీలో మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డిని కాలనీవాసులు ఘనంగా సన్మానించారు. కాలనీవాసుల ఆహ్వానం మేరకు ఆయన కాలనీలో పర్యటించగా, గత ఐదేళ్లుగా కాలనీ అభివృద్ధికి కృషి చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ పలు సేవలు అందించినందుకు శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా కాలనీలో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను చేపట్టడంతో పాటు, పార్కు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాలనీవాసులు ఆయనను కోరారు. దీనిపై కళ్లెం నవజీవన్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే తన లక్ష్యమని తెలిపారు. హయత్‌నగర్ డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని, కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు గంగాని శ్రీనివాస్, కాలనీ అధ్యక్షుడు విట్టల్, కార్యదర్శి వెంకటేశం, ఉపాధ్యక్షుడు భాషని, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న కళ్లెం నవజీవన్ రెడ్డిని ఈ సందర్భంగా కాలనీవాసులు అభినందించారు.

# 14న అంబేద్కర్ చౌరస్తాలో బతుకమ్మ సంబురాలు

## మల్‌రెడ్డి స్నేహా అభిషేక్‌రెడ్డి పిలుపు

**రంగారెడ్డి, అక్టోబర్ 12 (జనంసాక్షి)**తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని ఇబ్రహీంపట్నంలో 'మల్‌రెడ్డి యువశక్తి' నేతృత్వంలో ఈ నెల 14వ తేదీన బుధవారం బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించనున్నామని మల్‌రెడ్డి స్నేహా అభిషేక్‌రెడ్డి తెలిపారు. ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో సాయంత్రం 5గంటల నుంచి నిర్వహించనున్న ఈ వేడుకల్లో భాగంగా ఆడబిడ్డలకు ప్రత్యేకంగా బతుకమ్మ పోటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు భారీ నగదు బహుమతులను అందజేయటం జరుగుతుందన్నారు. ప్రథమ బహుమతిగా రూ.25,000, ద్వితీయ బహుమతిగా రూ.15,000, తృతీయ బహుమతిగా రూ.10,000 లను గౌరవ శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా అందించటం జరుగుతుందని తెలిపారు. మహిళల్లో పండుగ ఉత్సాహాన్ని పెంపొందించడంతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ వేడుకలను మరింత ఉత్సాహభరితంగా నిర్వహించేందుకు ప్రముఖ జానపద కళాకారులు కూడా పాల్గొననున్నారన్నారు. మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ సంబురాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# మున్సిపాలిటీలో రోడ్లను అద్దంలా తీర్చి దిద్దడమే ప్రభుత్వ లక్ష్యం

### చైర్మన్ శీరిష కృష్ణారెడ్డి



**అలియాబాద్ అక్టోబర్ 12 (జనంసాక్షి)**సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అలియా బాద్‌లో 17, 20వ వార్డుల్లో మున్సిపల్ జనరల్ నిధుల ద్వారా 4 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను అలియా బాద్ పురపాలక సంఘం చైర్‌పర్సన్ కంఠం శీరీష కృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ వెంకట్ రెడ్డి,స్థానిక కౌన్సిలర్లు 17వ వార్డు ముద్దం సుధాకర్ రెడ్డి, 20వ వార్డు వంగరి మౌనిక దినేష్, తాళ్ల స్వప్న రాం ప్రసాద్, తలారి మౌనిక బాబు, గాదె వెంకటేష్, వడగం యమున శ్యామ్, సామల జశ్వంత్ రెడ్డి, గుర్కా కుమార్, మున్సిపల్ ఏఈఈ సనా షాహీన్, మున్సిపల్ సిబ్బంది మరియు వార్డు ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు మెరుగైన రహదారులు, నాణ్యమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు మున్సిపాలిటీ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యతనిస్తూ, ప్రతి వార్డులో సమగ్ర అభివృద్ధి సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు.

# ఢిల్లీ ధర్నాలో ఎమ్మెల్యే కాలే యాదయ్య



**చేవెళ్ల, అక్టోబర్ 12 (జనంసాక్షి)** దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పాల్గొని నిరసన తెలిపారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు జనార్ధన్ రెడ్డి, చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు బి. శ్రీనివాస్ గౌడ్, మాజీ మండల అధ్యక్షుడు వీరేందర్ రెడ్డితో పాటు పలువురు నాయకులు ధర్నాలో పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.

# ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లతోనే సంపూర్ణ ఆరోగ్యం



**మల్కాజిగిరి అక్టోబర్ 12 (జనం సాక్షి)**ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని మల్కాజిగిరి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధా పేర్కొన్నారు. హాస్పిటల్ ప్రాంగణంలో సోమవారం స్త్రీ శక్తి ఫుడ్స్ కేంద్రాన్ని ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. ప్రతి ఒక్కరికీ పోషక విలువలతో కూడిన సమతుల్య ఆహారం ఎంతో అవసరమన్నారు. ప్రజలకు నాణ్యమైన, పౌష్టికాహారాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు స్త్రీ శక్తి బృందం చేపట్టిన ఈ చొరవ ఎంతో అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డా. సాయిశోభ, డిప్యూటీ ఆర్ఎంఓ డా. మాధురి, వైద్యులు కల్యాణి, సత్యవతి, విజయశ్రీ, కిరణ్, స్వాతి, ఏడీ రమేశ్, ఏఓ యవ్వన్, నర్సింగ్ సూపరింటెండెంట్ రోసిలిన్, స్త్రీ శక్తి ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావం.. ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన

### వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలి సీఎస్ సంజయ్ జాజు



**చేవెళ్ల, అక్టోబర్ 12 (జనంసాక్షి)** వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పాల్గొని, ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ రంగంపై పడే ప్రభావాలు, రైతులు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి, ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు ప్రణాళికతో పంటల సాగు చేపట్టాలని సూచించారు. అధిక నీరు అవసరమయ్యే వరి, చెరకు, పసుపు వంటి పంటలకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల మొక్కజొన్న, జొన్న, కుసుమ, శనగ, ఇతర పప్పుధాన్యాల వంటి ఆరుతడి పంటలను ఎంచుకోవాలని తెలిపారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవడం ద్వారా నీటి కొరత కారణంగా కలిగే నష్టాలను తగ్గించుకోవచ్చని, రైతులు మెరుగైన ఆదాయం పొందేందుకు అవకాశముంటుందని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ, రానున్న వానాకాలం పంటల సాగుకు తగిన ప్రణాళిక రూపొందించుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల రెవెన్యూ డివిజనల్ అధికారి పార్థసింహా రెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ ఆలూరు ప్రశాంత్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, గ్రామ ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# ప్రజల ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



**వికారాబాద్ జిల్లా బ్యూరో అక్టోబర్ 12 (జనం సాక్షి):**వివిధ స్థాయిలలో పెండింగ్ ఉన్న ప్రజావాణి ఫిర్యాదు లను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. సోమవారం ఐ డి ఓ సి సమావేశం హాలు నందు జిల్లా అధికారులతో కలిసి ప్రజల నుండి ప్రజా ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజల నుంచి అందే ఫిర్యాదులు, వినతులను అధికారులు స్వయంగా స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ ఆద్వర్యంలో జరిగే ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రదాన్యత ఇవ్వాలని ,ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు, సమయానికి హాజరై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి, వాటిని వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.. ప్రజావాణిలో 110 ఫిర్యాదులు వచ్చాయని, స్వీకరించిన ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారులు పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, ఫిర్యాదుల పరిష్కార పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారుప్రతి సోమవారం ప్రతి మండలం లో జరిగే ప్రజావాణి కి సంబంధించిన ఫిర్యాదు లపై మండల స్పెషల్ అడికారులు పూర్తి బాధ్యత వహించాలని , ఫిర్యాదుల లిస్టు సబ్మిట్ చేయాలని అదికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ లు ఉమా శంకర్ ప్రసాద్, వెంకటాచారి , జడ్ పి సి ఇ ఓ సుధీర్, జిల్లా అదికారులు , తదితరులు పాల్గొన్నారు..

# ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొందాం

### జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి



**రంగారెడ్డి, అక్టోబర్ 12(జనంసాక్షి):** ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రైతుల సిద్ధంగా ఉండాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఢిల్లీ నుంచి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నిర్వహించిన 'రైతు నేస్తం' వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన రైతాంగాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఉప్పరిగూడ రైతు వేదిక నుండి జిల్లా కలెక్టర్ రైతులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంగారెడ్డి నివేదికను జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఉప్పరిగూడ రైతు వేదికలో జరిగిన సమావేశంలో అధికారులకు, రైతులకు దిశా నిర్దేశం చేశారు. సాగులో ఉన్న పంటలను కాపాడుకునేందుకు డ్రిప్, స్ప్రింక్లర్ పద్ధతులను ప్రోత్సహించాలన్నారు. భూగర్భ జలాలు, విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలన్నారు. వేసవి నాటికి తాగునీటి కొరత రాకుండా మిషన్ భగీరథ నీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లోని మోటార్లు, బోర్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలన్నారు. బోరుబావుల నీటి మట్టాలను బట్టి పంట విస్తీర్ణాన్ని తగ్గించుకోవాలన్నారు. హైదరాబాద్ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఆకుకూరలు, కూరగాయల సాగును ప్రోత్సహించాలన్నారు. వ్యవసాయ పనులు లేని ప్రాంతాల్లో రైతు కూలీల కోసం ఉపాధి హామీ కింద భూగర్భ జలాల పెంపు,నీటి సంరక్షణ పనులను విస్తృతంగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి, జిల్లా వ్యవసాయ అధికారి సుజాత, డీపీఓ సురేష్ మోహన్, పీడీ డీఆర్డీఏ శ్రీలత, ఉద్యానవన శాఖ అధికారి సురేష్, మిషన్ భగీరథ అధికారి రాజేశ్వర్ రావు, ఆర్డీఓ శ్రీనివాస్ రెడ్డి, పలువురు అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## యాచారంలో జాతీయ కుటుంబ ప్రయోజన పథకం అమలు - అర్హులు సద్వినియోగం చేసుకోవాలి

**యాచారం, అక్టోబర్ 12(జనం సాక్షి )** యాచారం మండల పరిధిలో కుటుంబ పెద్దను కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అర్హులైన కుటుంబాలకు 'జాతీయ కుటుంబ ప్రయోజన పథకం' (ఎన్ఎఫ్‌బీసీ) ద్వారా ప్రభుత్వ నిబంధనల ప్రకారం భరోసా కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలో ఈ పథకం కింద ఇప్పటివరకు మొత్తం 133 దరఖాస్తులు నమోదయ్యాయి. వీటిలో ఎంపీడీఓ స్థాయిలో 74 దరఖాస్తులు ఆమోదించబడగా, ఇప్పటికే 31 మంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో ఆర్థిక సహాయం జమ అయింది. అలాగే 8 దరఖాస్తులు తిరస్కరించబడగా, మిగిలిన దరఖాస్తులు పరిశీలన దశలో ఉన్నాయి. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తమ సమీపంలోని మీ-సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రకారం భరోసా కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు సూచించారు. దరఖాస్తు సమయంలో అవసరమైన మరణ ధ్రువీకరణ పత్రం, అలాగే 8 దరఖాస్తులు తిరస్కరించబడగా, మిగిలిన దరఖాస్తులు పరిశీలన దశలో ఉన్నాయి. ఈ పథకం కింద ఇప్పటివరకు మొత్తం 133 దరఖాస్తులు నమోదయ్యాయి. ఆధార్, రేషన్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ తదితర పత్రాలను సమర్పించాలి. మరింత సమాచారం కోసం గ్రామ పంచాయతీ కార్యదర్శులను లేదా మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని సంప్రదించవచ్చని ఎంపిడివో రాధా రాణి పేర్కొన్నారు.

# ప్రజా మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట

## రూ. 3 కోట్ల 94 లక్షలు శంకుస్థాపన

### అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**కాప్రా, అక్టోబర్ 12 ( జనం సాక్షి):** ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే అభివృద్ధి పనులకు లక్ష్యం అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఉప్పల్ నియోజకవర్గ కుషాయిగూడ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో మూడు కోట్ల 94 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులకు సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలు, ఆర్‌సీసీ పైప్‌లైన్ వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.. వైష్ణవి ఎన్‌క్లేవ్ --36 లక్షలు, ఆదర్శ్ నగర్ -- 20 లక్షలు, చక్రిపురం --22లక్షలు,లక్ష్మీనరసింహ కాలనీ -- 26 లక్షలుకుషాయిగూడ గ్రామం -- 30 లక్షలు, భారత్ నగర్ -- 29.70 లక్షలు. ధోబీఘాట్ -- 19.80 లక్షలు,. హనుమాన్ నగర్ -- 17 లక్షలు,శివ సాయి నగర్ -- 42 లక్షలు, మారుతి నగర్ -- 25 లక్షలు, నాగార్జున నగర్ -- 35 లక్షలు,.సోనియా గాంధీ నగర్ -- ఆర్‌సీసీ పైప్‌లైన్ పనులకు,25 లక్షలు,శ్రీనివాస్ ఎన్‌క్లేవ్ -- 40 లక్షలు ఇందిరా నగర్ -- యూజీడీ పనులకు 27.50 లక్షలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూఉప్పల్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి, కాలనీల వారీగా అభివృద్ధి పనులు చేపడుతూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ అభివృద్ధి పనుల ద్వారా కాలనీల్లో మౌలిక సదుపాయాలు మరింత మెరుగుపడటంతో పాటు, స్థానిక ప్రజలకు సౌకర్యవంతమైన జీవన పరిస్థితులు అందుబాటులోకి రానున్నాయి. ముఖ్యంగా డ్రైనేజీ సమస్యల పరిష్కారం, మురుగునీటి పారుదల వ్యవస్థ మెరుగుదల, పైప్‌లైన్ సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరనుంది. ఈ కార్యక్రమంలో అధికారులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఎంఎంసీ కార్మికులకు కేటగిరీల వారీగా రూ.30 వేల వేతనం చెల్లించాలి

### కార్మికుల సమస్యలు పరిష్కరించాలి -- సీఐటీయూ జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్



**హయత్ నగర్, అక్టోబర్ 12 (జనం సాక్షి)**జీహెచ్ఎంసీ పరిధిలో పనిచేస్తున్న ఎంఎంసీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులకు కేటగిరీల వారీగా నెలకు రూ.30 వేల వేతనం చెల్లించాలని సీఐటీయూ, జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. హయత్‌నగర్ సర్కిల్ సూపరింటెండెంట్ యాదయ్యకు కార్మికుల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ సీనియర్ నాయకులు తుమ్మల సత్తిరెడ్డి, జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆలేటి ఎల్లయ్య మాట్లాడుతూ.. గత 40 సంవత్సరాలుగా జీహెచ్ఎంసీ ఎంఎంసీ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులు రోడ్లను శుభ్రం చేస్తూ హైదరాబాద్ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నారని తెలిపారు. ప్రభుత్వాలు మారుతున్నా కార్మికుల జీవితాల్లో మాత్రం మార్పు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.కార్మికులకు నెలకు సుమారు రూ.18 వేల వేతనం చెల్లిస్తూ, అందులో నుంచి ఈఎస్ఐ, పీఎఫ్, టీడీఎస్ పేరుతో కోతలు విధిస్తున్నారని పేర్కొన్నారు. కార్మికుల వేతనాల నుంచి కోత విధిస్తున్న రెండు శాతం టీడీఎస్ మొత్తాన్ని వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులను పర్మినెంట్ చేయడంతో పాటు సొసైటీల ద్వారా కాకుండా నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో వేతనాలు జమ చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రెండో పీఆర్సీని ప్రకటించి, డీఏ వర్తింపజేయాలని, కార్మికులకు సంవత్సరానికి 13 నెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. శ్మశానవాటికల్లో అదనపు పనులు చేయిస్తున్నారని, నాగోల్ సర్కిల్‌లో ఆరుగురు కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడం బాధాకరమని అన్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని కోరారు.అక్టోబర్ 26న చలో హైదరాబాద్ ధర్నాను జయప్రదం చేయాలి కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 26న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే ధర్నాలో ఎంఎంసీ, జీహెచ్ఎంసీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. అలాగే డిసెంబర్ 1, 2, 3 తేదీల్లో మూడు రోజులపాటు నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమంలో కార్మికులంతా పాల్గొని పోరాటాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ సర్కిల్ కన్వీనర్, జిల్లా కమిటీ సభ్యుడు చింతపల్లి కృష్ణయ్య, జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు సిహెచ్ జంగయ్య, ముషం నరహరి, ఎల్లమ్మ, సువర్ణ, అనిత, అలివేలు, దాసరి జయమ్మ, అనసూర్య, శాంతమ్మ, హేమలత, రేణుక, విజిత, సౌందర్య, లక్ష్మమ్మ, శ్రీను, మహేష్, రాజు, బాలరాజు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ ప్రాంగణంలో అంబరాన్ని తాకిన బతుకమ్మ సంబరాలు

### పాల్గొన్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



**హైదరాబాద్, అక్టోబర్ 12:**బతుకమ్మ కేవలం పండుగ మాత్రమే కాదని, తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, ప్రకృతిని ఆరాధించే గొప్ప సంస్కృతికి ప్రతీక అని తెలంగాణ శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికి ఆదర్శమని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కొనియాడారు. తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో సోమవారం రోజు సాయంత్రం నిర్వహించిన బతుకమ్మ సంబరాలు అంబరాన్ని తాకాయి. ఈ సంబరాల్లో శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ పాల్గొని ఆడపడుచులతో కలిసి బతుకమ్మ ఆడారు. బంతి, చామంతి, గునుగు, తంగేడు పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను మధ్యలో ఉంచి, మహిళా ఉద్యోగులు, సిబ్బంది చుట్టూ చేరి "బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో" అంటూ పాటలు పాడుతూ ఆడి పాడారు. మహిళలంతా బతుకమ్మల చుట్టూ తిరుగుతూ చప్పట్లు కొడుతూ భక్తిశ్రద్ధలతో పాటలు పాడారు. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మీయత, ఉత్సాహం మధ్య సాగిన ఈ వేడుకలు పండుగ వాతావరణాన్ని తలపించాయి. తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణం సోమవారం సాయంత్రం రంగురంగుల పూలతో, ఆడపడుచుల ఆనంద కోలాహలంతో కళకళలాడింది. బతుకమ్మ వేడుకల్లో శాసన మండలి సెక్రెటరీ డా. నరసింహాచార్యులు, శాసనసభ సెక్రెటరీ ఆర్. తిరుపతి, శాసనసభ, శాసన మండలి ఉన్నతాధికారులు, మహిళా ఉద్యోగులు, ఇతర సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ద్వారా రూ.6.30 లక్షల పరిహారం

### బాధిత కుటుంబానికి చెక్కు అందజేసిన మున్సిపల్ చైర్మన్ సమతా వెంకట్ రెడ్డి, ఎస్సై కోటేశ్వరరావు




**చేవెళ్ల, అక్టోబర్ 12 (జనంసాక్షి)** చేవెళ్ల మండలం జాలగూడెం గ్రామానికి చెందిన శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీదారుడు అచ్చిన వెంకటయ్య ఇటీవల వడదెబ్బతో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి రూ.6,30,637 బీమా పరిహారం మంజూరైంది. ఈ మేరకు పరిహారం చెక్కును చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, ఎస్సై కోటేశ్వరరావు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ దేవర సమతా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, అనుకోని విపత్కర పరిస్థితుల్లో కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంలో జీవిత బీమా కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబ భవిష్యత్తు, ఆర్థిక భద్రతను దృష్టిలో ఉంచుకుని జీవిత బీమా పాలసీలు తీసుకోవాలని సూచించారు. బీమా పరిహారం బాధిత కుటుంబానికి కొంతవరకు ఆర్థిక అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షీ టీం ఎస్సై ధర్మీయ రాథోడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ రాము గౌడ్, కౌన్సిలర్ మద్దెల శ్రీనివాస్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ చేవెళ్ల బ్రాంచ్ మేనేజర్ ఎస్.హనుమంత్, సీనియర్ డీజీఎం నరేందర్, ఏజీఎం శ్రీనివాస్, బీడీఎం ఎం.హర్షవర్ధన్, సంస్థ సిబ్బంది కె. రమేష్, పి.వెంకటేష్, సి.సరిత, సి.కుమార్, బి.మాణిక్యం, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, సేల్స్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

# బౌరంపేట్‌లో అక్రమ నిర్మాణాల పై రెవెన్యూ అధికారులు కన్నెర్ర



**కుత్బుల్లాపూర్అక్టోబర్12(జనంసాక్షి)**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ 59 పరిధిలోని బౌరంపేట్ సర్వేనెంబర్ 578, 580 పరిధిలో ఇటీవల పలు చోట్ల అక్రమ నిర్మాణాలు జోరు అందుకున్నాయి. ఈ అక్రమ నిర్మాణాలపై అధికారుల కు అనేక ఫిర్యాదుల రావడంతో ఎట్టకేలకు అక్రమ నిర్మాణాలపై దుండిగల్ తాసిల్దార్ రాజేశ్వర్ రెడ్డి ఆదేశాలు జారీ చేయడంతో ఈ మేరకు ఆర్ఐ రవికుమార్ నేతృత్వంలో సోమవారం అక్రమ నిర్మాణాలు ఎనిమిది బేస్మెట్లు, రెండు రూములు కూల్చివేతలు చేపట్టారు. ఈ సందర్భంగా తాసిల్దార్ రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల విరుద్ధంగా ఎవరు అక్రమ నిర్మాణాలు చేపట్టిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో ప్రకాష్, వీఆర్ఏలు జితేందర్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

# చేవెళ్లలో ప్రజావాణికి రెండు వినతులు

### ఫిర్యాదుల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలి ఆర్డీఓ పార్థసింహా రెడ్డి



**చేవెళ్ల, అక్టోబర్ 12 (జనంసాక్షి):** ప్రజల సమస్యల పరిష్కారం కోసం చేవెళ్ల రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి రెండు వినతులు అందాయి. రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్డీఓ) పార్థసింహా రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి డివిజన్ పరిధిలోని వివిధ శాఖలకు చెందిన అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖకు సంబంధించి రెండు దరఖాస్తులు అందినట్లు అధికారులు వెల్లడించారు. అందిన వినతులను సంబంధిత శాఖలకు పంపించి, వాటిని త్వరితగతిన పరిశీలించి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో పార్థసింహా రెడ్డి కోరారు.

## వికలాంగుల పునరావాస కేంద్రంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



కొడంగల్, అక్టోబర్ 12 (జనం సాక్షి):వికారాబాద్ జిల్లా కొడంగల్ మండల మహిళా సమాఖ్య వికలాంగుల పునరావాస కేంద్రం ఆవరణలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, ఆటపాటలతో సందడి చేశారు. బతుకమ్మ పాటలు పాడుతూ, బొడ్డెమ్మ ఆటలతో వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటిద్దాం

### ట్రాఫిక్ సీఐ జితేందర్ రెడ్డి



రంగారెడ్డి అక్టోబర్ 12 (జనంసాక్షి):రోడ్డు భద్రతా నిబంధనలను పాటించి ప్రమాదాలను నివారించాలని ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ సిఐ జితేందర్ రెడ్డి సూచించారు. ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక రోడ్డు భద్రతా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు ప్రయాణంలో విధిగా నాణ్యమైన హెల్మెట్ ధరించాలన్నారు. కార్లలో ప్రయాణించే ప్రయాణికులు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు.ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను స్వచ్ఛందంగా పాటిస్తూ, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐలు కానిస్టేబుల్స్ ఉన్నారు.

## తుంకుంట గాయత్రి ఆలయంలో శరన్నవరాత్రోత్సవాలు



శామీర్ పేట, అక్టోబర్ 12 (జనం సాక్షి ) శ్రీగాయత్రి మహాక్షేత్రంలో కన్నుల పండవగా శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభమైయ్యాయి. ఆలయ వ్యవస్థాపకులు, వాక్ బ్రహ్మ, శిష్య జనోద్ధారక డాక్టర్ ఎస్విఎల్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో వేదబ్రాహ్మణుల మంత్రోశ్చరణల మధ్య సోమ వారం శరన్నవరాత్రోత్సవాలకు ఘనంగా కొనసాగుతున్నాయి . రెండవ రోజు అమ్మవారిని కంచి కామాక్షి దేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనము, పంచగవ్య ప్రాసన, ఋత్విక్ గరణము, అంకురార్పణము, కళశ స్థాపన, అనుష్ఠానములు జరిపారు. దేవి భాగవత పారాయణము, శ్రీ చక్ర నవవర్ణార్చన, త్రికాల సహస్ర నామార్చనలు, తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఈ పూజల్లో ఉమ్మడి మండలం భక్తులతో పాటు నగరానికి చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ కార్య క్రమంలో భక్తులు పాల్గొన్నారు.

## ప్రభావిత ప్రాంతాల గుర్తింపు.. నష్టపరిహారం చెల్లింపుపై అధికారుల మధ్య చర్చ

ఉప్పల్, అక్టోబర్ 12 (జనం సాక్షి): ఉప్పల్ ఫ్లైఓవర్ పరిసరాల్లో భూసేకరణ, ప్రభావిత నిర్మాణాలు, నష్టపరిహారానికి సంబంధించిన అంశాలపై సంబంధిత శాఖల అధికారులు దృష్టి సారించారు. ఈ మేరకు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) కమిషనర్, సర్వే ఆఫ్ ఇండియా సర్వే సూపరింటెండెంట్‌తో పాటు ఎంఎంసీ, సర్వే ఆఫ్ ఇండియాకు చెందిన పలువురు అధికారులు ఉప్పల్ ఫ్లైఓవర్ వద్ద సంయుక్త తనిఖీ నిర్వహించారు. ఫ్లైఓవర్ పరిసరాల్లో సర్వే ఆఫ్ ఇండియాకు చెందిన భూమికి సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలనలు జరిపి, అభివృద్ధి పనుల కారణంగా ప్రభావితమైన ప్రాంతాలను సమీక్షించారు. 0.78 ఎకరాల భూమిపై పరిశీలన సంయుక్త తనిఖీలో భాగంగా కేంద్రీయ విద్యాలయ పాఠశాల సమీపంలోని సర్వే ఆఫ్ ఇండియా భూమిని అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా మొత్తం 0.78 ఎకరాల భూమిలో ఫ్లైఓవర్ అభివృద్ధి పనుల కారణంగా ప్రభావితమైన భాగాలను గుర్తించి, అక్కడ ఉన్న ప్రహరీ గోడలు, షెడ్లు తదితర నిర్మాణాలను పరిశీలించారు. ఆయా నిర్మాణాలు, భూమికి సంబంధించి ప్రభావితమైన ప్రాంతాల వివరాలను సమీక్షించి, తదుపరి చర్యలకు అవసరమైన అంశాలపై చర్చించారు.నష్టపరిహార చెల్లింపుపై చర్చ సర్వే ఆఫ్ ఇండియాకు చెందిన భూమి, అక్కడ ఉన్న నిర్మాణాలకు సంబంధించి వర్తించే నష్టపరిహారం చెల్లించాల్సిన అంశాన్ని అధికారులు చర్చించారు. ప్రభావిత భూమి విస్తీర్ణాన్ని స్పష్టంగా అంచనా వేయడం, సంబంధిత వివరాలను పరిశీలించడం, నిబంధనల ప్రకారం నష్టపరిహారానికి సంబంధించిన అంశాలను ముందుకు తీసుకెళ్లడం వంటి విషయాలపై దృష్టి సారించారు. ఈ ప్రక్రియలో ఇరు



విభాగాల మధ్య సమన్వయం కీలకమని అధికారులు భావిస్తున్నారు.అభివృద్ధి పనులకు సమన్వయం కీలకంఉప్పల్ ఫ్లైఓవర్ పరిసరాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి భూమి వివరాలు, ప్రభావిత నిర్మాణాలు, నష్టపరిహారం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించడం ఈ సంయుక్త తనిఖీ ప్రధాన ఉద్దేశంగా ఉంది. సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో కలిసి పరిశీలించడం ద్వారా భూమికి సంబంధించిన అంశాలపై స్పష్టత తీసుకురావడంతో పాటు, తదుపరి చర్యలను సమన్వయంతో చేపట్టేందుకు అవకాశం ఏర్పడుతుంది. భూమి అంచనా, నిర్మాణాల వివరాలు, నష్టపరిహారానికి సంబంధించిన అంశాలపై సంబంధిత విభాగాల మధ్య సమన్వయం కొనసాగించాల్సిన అవసరం ఉందని ఈ తనిఖీ ద్వారా స్పష్టమవుతోంది.

## విద్యార్థుల ఉద్యమానికి, ఓటు హక్కుల పరిరక్షణ పోరాటానికి సంపూర్ణ మద్దతు

### డా. జితేందర్ రావు తనుగుల

హైదరాబాద్ (జనంసాక్షి)దేశంలో రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల బలోపేతం, సామాజిక న్యాయం కోసం విద్యార్థులు, ప్రజాస్వామ్యవాదులు చేస్తున్న పోరాటాలకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు ఇవ్వాలని సీనియర్ జర్నలిస్ట్, తెలంగాణ యూత్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీవైజేఎఫ్) అధ్యక్షుడు డా. జితేందర్ రావు తనుగుల విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని జంతర్ మంతర్‌తో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో విద్యార్థులు తమ హక్కులు, సమాన అవకాశాలు, సామాజిక న్యాయం కోసం నిర్వహిస్తున్న ఉద్యమాలకు ప్రజలు సంఘీభావం ప్రకటించాలని ఆయన కోరారు. మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను విశ్వసించే విద్యార్థులతో పాటు ప్రజాస్వామ్య, సామాజిక న్యాయ భావజాలం కలిగిన యువత, మార్క్సిస్టు, కమ్యూనిస్టు భావజాలాన్ని అనుసరించే విద్యార్థులు, రాజ్యాంగ విలువలను కాపాడాలని కోరుకునే ప్రజలందరూ శాంతియుత ఉద్యమాలకు అండగా నిలవాలని పేర్కొన్నారు. అదేవిధంగా, దేశ ప్రజాస్వామ్యానికి పునాదిగా ఉన్న ఓటు హక్కును పరిరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని డా. జితేందర్ రావు తనుగుల స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించబడుతున్నాయనే ఆందోళనల నేపథ్యంలో, ఓటు హక్కుల పరిరక్షణ కోసం సిటిజెన్స్ ఫర్ జస్టిస్ అండ్ పీస్ (సీజేపీ) చేస్తున్న పోరాటానికి తన సంపూర్ణ మద్దతు ప్రకటించారు.ఓటర్ల జాబితాల సవరణ పారదర్శకంగా, చట్టబద్ధమైన నిబంధనలకు అనుగుణంగా జరగాలని ఆయన కోరారు. అర్హులైన ఏ పౌరుడూ తన ఓటు హక్కును కోల్పోకుండా ఎన్నికల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పొరపాటున ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించబడితే, బాధితులకు అభ్యంతరాలు తెలిపేందుకు, తమ పేర్లను తిరిగి చేర్చుకునేందుకు చట్టబద్ధమైన అవకాశం కల్పించాలని పేర్కొన్నారు.సర్ ప్రక్రియలో అవకతవకలు లేదా నిర్లక్ష్యం జరిగినట్లు ఆధారాలతో నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలనే డిమాండ్‌తో సహా ఈ వ్యవహారానికి సంబంధించి



వచ్చిన ఆరోపణలు, ఫిర్యాదులను నిష్పక్షపాతంగా పరిశీలించాలని, తప్పిదాలు నిర్ధారణ అయిన పక్షంలో చట్టప్రకారం తగిన చర్యలు చేపట్టాలని కోరారు.బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతో పాటు అగ్రవర్ణాలు, ఓసీలు సహా అన్ని సామాజిక వర్గాల ప్రజలు విద్యార్థుల న్యాయమైన డిమాండ్లకు, అర్హులైన పౌరుల ఓటు హక్కుల పరిరక్షణకు మద్దతుగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలు ఏ ఒక్క కులానికి, మతానికి లేదా రాజకీయ భావజాలానికి మాత్రమే పరిమితమైనవి కావని, దేశంలోని ప్రతి పౌరుడి హక్కులు, భవిష్యత్తుతో ముడిపడి ఉన్నాయని అభిప్రాయపడ్డారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడటం, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం, విద్యార్థుల న్యాయమైన డిమాండ్లకు మద్దతు ఇవ్వడం, అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడం దేశ ప్రజలందరి బాధ్యత అని డా. జితేందర్ రావు తనుగుల పేర్కొన్నారు. సమానత్వం, సోదరభావం, సామాజిక న్యాయం ఆధారంగా సమాజ నిర్మాణం జరగాలంటే ప్రజలంతా ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు.

# విద్యార్థినులకు న్యాయం చేయాలి

### బిమోల్ అంగోమ్జాను కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేయాలి

చేవెళ్ల, అక్టోబర్ 12 (జనంసాక్షి) జేఎన్‌యూ మాజీ ప్రొఫెసర్, కాంగ్రెస్ ఎంపీ బిమోల్ అంగోమ్జాపై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధిత విద్యార్థినులకు న్యాయం చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. బిమోల్ అంగోమ్జాను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతో పాటు, ఆయన లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా చేయాలని కోరారు. బీజేపీ మహిళా మోర్చా పిలుపు మేరకు రంగారెడ్డి జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో సోమవారం చేవెళ్ల మున్సిపల్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, బిమోల్ అంగోమ్జా దిష్టిబొమ్మలను దహనం చేశారు. చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కె.ఎస్. రత్నం మాట్లాడుతూ.. మహిళలపై వేధింపుల ఆరోపణలు వచ్చినప్పుడు రాజకీయాలకు అతీతంగా నిష్పక్షపాత విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలన్నారు. మహిళల గౌరవం, భద్రత విషయంలో నిర్లక్ష్యానికి తావివ్వరాదని, ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి స్వర్ణలత రెడ్డి, రంగారెడ్డి జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు పడమటి మమత రెడ్డి మాట్లాడుతూ.. విద్యాసంస్థల్లో విద్యార్థినులకు సురక్షిత వాతావరణం కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యాలు, ప్రభుత్వాలపై ఉందన్నారు.



విద్యార్థినులపై వేధింపుల ఆరోపణలను తీవ్రంగా పరిగణించి, నిష్పక్షపాత విచారణ ద్వారా నిజానిజాలు వెలికితీసి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అత్తెల్లి అనంత్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీశైలం యాదవ్, డాక్టర్ వైభవ్ రెడ్డి, సీనియర్ నాయకులు ఆంజనేయులు గౌడ్, కుంచం శ్రీనివాస్, శర్వలింగం, వెంకట్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, మోహన్ రెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఉమా, కౌన్సిలర్ మనీషా అనంత్ రెడ్డి, మీనాక్షి సత్యనారాయణ, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి పత్తి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు పీసరి శ్రీకాంత్ రెడ్డి, నాగరాజు గౌడ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భరత్ నగర్‌లో ఘనంగా హజ్రత్ పీర్ అబ్దుల్లా షా మిస్త్రీ షా ఖాద్రీ ఉర్సు షరీఫ్

### ఉర్సు షరీఫ్‌లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్)



**ఉప్పల్, అక్టోబర్ 12 (జనం సాక్షి):** ఉప్పల్ నియోజకవర్గంలోని భరత్ నగర్‌లో హజ్రత్ పీర్ అబ్దుల్లా షా అల్ మారూఫ్ మిస్త్రీ షా ఖాద్రీ (రహ్మతుల్లాహి అలైహి) వారి పవిత్ర ఉర్సు షరీఫ్ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా, పలువురు ప్రముఖులు, స్థానిక పెద్దలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) హాజరై ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇర్షాద్ ఖాన్ దర్గాలో ప్రార్థనలు నిర్వహించి, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. సమాజంలో శాంతి, సామరస్యం, సోదరభావం వెల్లివిరియాలని, ప్రజల మధ్య ఐక్యత మరింత బలోపేతం కావాలని ప్రార్థించారు. అనంతరం ఇర్షాద్ ఖాన్ మాట్లాడుతూ, సూఫీ మహనీయుల బోధనలు ప్రేమ, మానవత్వం, సేవాభావం, మతసామరస్యానికి ప్రతీకలని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో జీవించాలని, ఒకరినొకరు గౌరవించుకుంటూ పరస్పర సహకారంతో ముందుకు సాగాలని సూచించారు. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల మధ్య సోదరభావాన్ని పెంపొందించడంతో పాటు, సమాజంలో శాంతి, సామరస్యాలను బలోపేతం చేయడానికి దోహదపడతాయని అన్నారు. ప్రజాసేవే లక్ష్యంగా అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఇర్షాద్ ఖాన్ తెలిపారు. ప్రజల సంక్షేమం, ప్రాంత అభివృద్ధి కోసం తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఉర్సు షరీఫ్ కార్యక్రమంలో హజ్రత్ సయ్యద్ షా హామెద్ హుస్సేన్ షుత్తారీ సాహెబ్ ఖిబ్లా, కరీముల్లా షా షుత్తారీ, నలాం అలీ షుత్తారీ సాహెబ్, సయ్యద్ మొహ్సిన్ షుత్తారీ, యాసీన్ ఖాన్ షుత్తారీ, ఇబ్రహీం ఖాన్ షుత్తారీ, షేక్ ఆసిఫ్, మహమ్మద్ జానీ, సయ్యద్ ఫహీమ్, షేక్ వహీద్, మహమ్మద్ షకీల్ సాహెబ్, మఖ్దూమ్ బాబా, రఫీక్ తదితర ప్రముఖులు, స్థానిక పెద్దలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# సహకార సంఘాల చైర్మన్లుగా బొల్లారం వెంకట్ రెడ్డి, గౌండ్ర సత్యంలు ప్రమాణ స్వీకారం



**శంకర్ పల్లి, అక్టోబర్ 12(జనం సాక్షి)**శంకర్ పల్లి మోకిలా సహకార సంఘం చైర్మన్లుగా బొల్లారం వెంకటరెడ్డి గౌండ్ర సత్యం లు సోమవారం ఆయా కార్యాలయాలలో ప్రమాణ స్వీకారం చేశారు. శంకర్ పల్లి,మోకిలా సీఈఓ లు రామ్ రెడ్డి, వేణు లు వారిచేత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం వారు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..రైతుల సంక్షేమం కోసం తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వానికి రైతులకు మధ్య వారధిలా ఉంటూ రైతులకు పంట రుణాలు దీర్ఘకాలిక రుణాలు,స్వల్పకాలికరుణాలుఅందించేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న రైతుల సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందేలా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్వేద సర్పంచ్ సురేందర్ గౌడ్, శంకర్పల్లి మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాసెట్టి చంద్రమోహన్, డీసీసి ఉపాధ్యక్షుడు గోపాల్ రెడ్డి,సర్పంచులు శేఖర్, బండ లక్ష్మీ నరసింహ, రవీందర్ రెడ్డి, బలవంత రెడ్డి, అజీమ్ లక్ష్మణ్ నాయక్, శ్రీనివాస్, బీరయ్య ఎల్లకొండ మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి, గోపులారం మాజీ సర్పంచ్ శ్రీనివాస్, శంకర్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సభావాత్ రాజు నాయక్,నాయకులు పాండురంగారెడ్డి, కాంత్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.

# పింఛన్ల దరఖాస్తుదారుల వద్దకే జడ్పీ సీఈఓ

### అర్హతలపై క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష పరిశీలన
### మూడు గ్రామపంచాయతీల్లో పర్యటన



**ధారూర్,అక్టోబర్ 12(జనంసాక్షి)**పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి అర్హతలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు వికారాబాద్ జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (జడ్పీ సీఈఓ) సుధీర్ నేరుగా రంగంలోకి దిగారు. కార్యాలయాలకే పరిమితం కాకుండా దరఖాస్తుదారుల వద్దకే వెళ్లి వారి పరిస్థితులను స్వయంగా తెలుసుకున్నారు. ధారూర్ మండలంలోని హరిదాసుపల్లి, చింతకుంట,ధారూర్ స్టేషన్ గ్రామపంచాయతీల పరిధిలో పర్యటించి, పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారితో ముఖాముఖి మాట్లాడారు. పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వ్యక్తిగత పరిస్థితులు,సంబంధిత వివరాలను జడ్పీ సీఈఓ అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల్లో పేర్కొన్న అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ,వారి వాస్తవ పరిస్థితులపై ఆరా తీశారు. దరఖాస్తుదారులతో నేరుగా మాట్లాడి అవసరమైన వివరాలను సేకరించారు. మూడు గ్రామపంచాయతీల పరిధిలో చేపట్టిన ఈ పరిశీలనలో పింఛన్ల అర్హతలకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి అర్హతలను క్షేత్రస్థాయిలో పరిశీలించడం ద్వారా వాస్తవ పరిస్థితులను తెలుసుకునే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో జడ్పీ సీఈఓ నేరుగా గ్రామాల్లో పర్యటించి దరఖాస్తుదారులతో మాట్లాడటం ప్రాధాన్యం సంతరించుకుంది. క్షేత్రస్థాయి పరిశీలనలో సేకరించిన వివరాలు పింఛన్ల దరఖాస్తుల ధ్రువీకరణ ప్రక్రియలో కీలకంగా నిలవనున్నాయి. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ అజయ్‌కుమార్, గ్రామపంచాయతీ కార్యదర్శులు కల్పన, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఆర్టీసీ -మెట్రో కామన్ పాస్ ఛార్జీల పునఃపరిశీలన

### మంత్రి పొన్నం ప్రభాకర్

**ముషీరాబాద్, అక్టోబర్ 12 (జనం సాక్షి):**ఇటీవల ప్రారంభించిన ఆర్టీసీ – మెట్రో కామన్ పాస్ ఛార్జీలను పునఃపరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కామన్ పాస్ ఛార్జీలు అధికంగా ఉన్నాయంటూ ప్రజల నుంచి వరుసగా ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ప్రజల అభిప్రాయాలను, వాస్తవ పరిస్థితులను సమీక్షిస్తున్నామని వెల్లడించారు. ప్రస్తుతం అమల్లోకి తీసుకొచ్చిన కామన్ పాస్ ధరలు రోజువారీ పాస్‌కు రూ.400 కాగా, ఇందులో మెట్రో వాటా రూ.300, ఆర్టీసీ వాటా రూ.100గా ఉంది. అదేవిధంగా నెలవారీ కామన్ పాస్ ధర రూ.8,500 కాగా, ఇందులో మెట్రో వాటా రూ.7,000, ఆర్టీసీ వాటా రూ.1,500గా నిర్ణయించారు. అయితే ఈ ఛార్జీలు సామాన్య ప్రజలకు భారంగా ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచనల మేరకు ఛార్జీలను పునఃపరిశీలించాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు. వాస్తవ పరిస్థితులను పరిశీలించి, ప్రజలకు అందుబాటులో ఉండేలా ఆర్టీసీ – మెట్రో కామన్ పాస్ ధరలను నిర్ణయించే అంశంపై త్వరలో ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు ప్రజలపై అదనపు ఛార్జీల భారం మోపడం ప్రభుత్వ లక్ష్యం కాదని, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని త్వరలోనే తగిన నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

# షార్ట్‌సర్క్యూట్‌తో నిరుపేద ఇంటికి నిప్పు
## రూ.50 వేల నష్టం



**యాలాల అక్టోబర్ 12 ( జనంసాక్షి ) :** యాలాల మండలం రాస్నం గ్రామంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా కుమ్మరి బుచ్చమ్మకు చెందిన ఇల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంట్లోని వస్తువులతో పాటు దాచుకున్న నగదు కాలిపోయి సుమారు రూ.50 వేల ఆస్తి నష్టం వాటిల్లింది. నిరుపేద కుటుంబానికి చెందిన బుచ్చమ్మ పింఛన్ డబ్బులను పొదుపు చేసుకొని దాచుకున్నప్పటికీ, అగ్నిప్రమాదంతో తీవ్రంగా నష్టపోయింది. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు నాయకులు సంబంధిత అధికారులను కోరారు. జరిగిన నష్టాన్ని పరిశీలించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# అధికారులు జారీ చేసిన నోటీసుల ప్రకారం చర్యలు విస్మరిస్తే లోకాయుక్తను ఆశ్రయిస్తాం

### ఆకుల సతీష్



**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 12( జనం సాక్షి)**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సర్కిల్ 59 పరిధిలోని మల్లంపేట జి ఎల్ ఎస్ కాలనీలో సర్వే నంబర్లు 170/1, 170/3, 170/4, 170/5లో అక్రమ నిర్మాణాలపై గతంలో అధికారులు జారీ చేసిన ఎనిమిది షోకాజ్ నోటీసుల ప్రకారం తక్షణమే చర్యలు తీసుకోవాలని సోమవారం దుండిగల్ సర్కిల్--59 డిప్యూటీ కమిషనర్‌ను కోరుతూ ఆకుల సతీష్ నేతృత్వంలో ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 12.05.2026న నిర్వహించాల్సిన విచారణపై ఇప్పటివరకు ఎలాంటి తుది చర్యలు తీసుకున్నారో వెల్లడించాలని, అక్రమ నిర్మాణాలను నిలిపివేసే బాధ్యులైన అధికారులపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకోవడం కాకుండా తక్షణమే చట్టపరమైన చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో పూర్తి ఆధారాలతో తెలంగాణ లోకాయుక్తను ఆశ్రయిస్తామని ఆకుల సతీష్, అమలేశ్వరి, కృష్ణారెడ్డి, అంకం సతీష్ హెచ్చరించారు.

# బతుకమ్మ.. బతుకమ్మ.. ఉయ్యాలో

### భద్రేశ్వర ఆలయంలో వీరశైవ మహిళల సంబరం



**తాండూరు అక్టోబర్ 12(జనంసాక్షి)**వీరశైవ సమాజం ఆధ్వర్యంలో, వీరశైవ అక్కమహాదేవి మహిళా కమిటీ సమక్షంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. దసరా నవరాత్రులను పురస్కరించుకొని ప్రతి సంవత్సరం నిర్వహించే బతుకమ్మ వేడుకలను ఈ సంవత్సరం కూడా భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. సోమవారం పట్టణంలోని శ్రీ బావిగి భద్రేశ్వర ఆలయ ప్రాంగణంలో వీరశైవ సమాజానికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. ఆలయ ప్రాంగణం మొత్తం పూల పరిమళాలతో, మహిళల బతుకమ్మ పాటలతో మార్మోగింది. ఈ సందర్భంగా మహిళలు బతుకమ్మల చుట్టూ చేరి, సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ఐక్యతతో జరుపుకోవడం ఆనందంగా ఉందని మహిళా కమిటీ సభ్యులు తెలిపారు. ఈ వేడుకల్లో వీరశైవ సమాజ పెద్దలు, అక్కమహాదేవి మహిళా కమిటీ సభ్యులు,మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సహజ వజ్రాభరణాల 'జూరీ' విస్తరణ ప్రణాళికలు

## ఏడాదిలో 25 కొత్త స్టోర్ల ఏర్పాటు లక్ష్యం



హైదరాబాద్, అక్టోబర్ 12 నైపుణ్యం, పారదర్శకత, కస్టమర్ల నమ్మకానికి ప్రతీకగా నిలిచి సహజ ఆభరణాలకు ప్రసిద్ధి చెందిన 'జూరీ' దేశవ్యాప్తంగా తన కార్యకలాపాలు విస్తరించేందుకు సిద్ధమైంది. వచ్చే ఏడాది కాలంలో దేశవ్యాప్తంగా 25 కొత్త స్టోర్లను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ వివరాలు తెలిపేందుకు మాదాపూర్‌లో ఉన్న డిస్ట్రిక్ట్ 150 బై క్వోరం హోటల్లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జూరీ వ్యవస్థాపకుడు మహేష్ చౌదరి మాట్లాడుతూ ఫ్యాక్టరీ స్థాయి నుంచి వినియోగదారులకు సేవలందించే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. రాబోయే మూడు నెలల్లో హైదరాబాద్‌లో నాలుగు స్టోర్లను ప్రారంభించనున్నామని చెప్పారు. వీటిలో మొదటి స్టోర్ రాజ్ భవన్ రోడ్‌లో ఈనెల 18వ తేదీన ప్రారంభం కానుందన్నారు. దేశవ్యాప్తంగా ప్రధాన నగరాలకు విస్తరిస్తున్న క్రమంలో ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ను కూడా ప్రారంభించాలని యోచిస్తున్నామన్నారు. దీని ద్వారా ఆన్‌లైన్-ఆఫ్‌లైన్ సమగ్ర రిటైల్ సేవలు అందిస్తూ.. తమ రోజువారీ కలెక్షన్లను దేశవ్యాప్తంగా ఉన్న వినియోగదారులకు అందుబాటులోకి తేనున్నామన్నారు. ఆభరణాల తయారీలో రెండుదశాబ్దాలకు పైగా అనుభవం ఉందన్నారు. ఆధునిక లైఫ్‌స్టైల్ డిజైన్లు, సర్టిఫైడ్ సహజ వజ్రాలు, అసలైన రత్నాలు, బిఐఎస్ హాల్‌మార్క్ 18, 14, 9 క్యారెట్ల కలిగిన నాణ్యమైన బంగారు ఆభరణాలు అందిస్తున్నామన్నారు. విభిన్న శైలులు, వివిధ సందర్భాలకు సరిపోయేలా ప్రత్యేకమైన కలెక్షన్లు కలవన్నారు. ఆభరణాలు చిరకాలం మన్నికగా ఉండేలా ఎలా తయారు చేయాలో తెలుసన్నారు. జూరీలోని ప్రతి డిజైన్ ఆ అనుభవంతోనే రూపుదిద్దుకుంటుందన్నారు. ఆభరణాల కొనుగోలు అనేది కేవలం అమ్మకాలపై కాకుండా విశ్వాసంపై ఆధారపడి ఉండాలని నమ్ముతున్నామన్నారు. కస్టమర్లు మా స్టోర్‌కు వచ్చిన సారే కాకుండా భవిష్యత్తులో కూడా సేవలు అందించడమే మా లక్ష్యమన్నారు.

# అపోలో మెడికల్ కాలేజ్ గ్రాడ్యుయేషన్ డే

## వైద్య విద్యార్థులకు పట్టాలు ప్రదానం



హైదరాబాద్(జనంసాక్షి)అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ ఆధ్వర్యంలో యూజీ, పీజీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ వేడుకలు జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ భవనం వెంకట్రామ్ ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ కార్డియాలజిస్ట్, కేర్ హాస్పిటల్స్ వ్యవస్థాపకులు, సింధు హాస్పిటల్స్ కార్డియాలజీ కన్సల్టెంట్ ఓ మెంటార్ డైరెక్టర్ పద్మశ్రీ డాక్టర్ బీ సోమరాజు విద్యార్థులకు డిగ్రీ పట్టాలు, బంగారు పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ ప్రతాప్ సీ రెడ్డి భారతదేశంలో ప్రైవేట్ ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. అత్యాధునిక వైద్య సేవలను దేశంలో అందుబాటులోకి తెచ్చారన్నారు. ఆ తర్వాత వచ్చిన అనేక సంస్థలకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. మన ప్రగతిలో ఎక్కువ భాగం ఆయన దార్శనికతక ఉందన్నారు. నా విజయ రహస్యం మనకంటే ప్రతిభావంతులైన వ్యక్తులతో మెలగడమన్నారు. ఆరోగ్య సంరక్షణ అనేది ప్రతి రోగికీ, ఆసుపత్రి బృందంలోని ప్రతి సభ్యుడికీ గౌరవం, సంరక్షణ లభించేలా, కరుణతో, సమానత్వంతో కూడినదిగా ఉండాలన్నారు. రోగితో సంభాషణ మీ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతుందన్నారు. ప్రతి విజయం మీ వినయాన్ని, ప్రతి క్లిష్టత మీ నిజాయితీని, ప్రతి నిస్సహాయ రోగి మీ కరుణను పరీక్షిస్తారన్నారు. 'నిరంతరం నేర్చుకోండి, ఒక బృందంగా పని చేయండి, రోగులకే ప్రథమ ప్రాధాన్యత ఇవ్వండి, 'నేను దేని కోసం గుర్తుండిపోవాలి?' అని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి' అని అన్నారు.

# మల్టీ డిజైనర్ స్టోర్ 'వియోనారా' ప్రారంభం




## ఫ్యాషన్ ప్రపంచంలో నయా అధ్యాయం

## ఒకే వేదికపైకి భారతీయ వర్ధమాన, ప్రముఖ డిజైనర్లు

హైదరాబాద్, అక్టోబర్ 12:::దేశంలో ఉన్న వర్ధమాన, ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ల ప్రత్యేక కలెక్షన్లను ఒకే గొడుగు కిందకు తెస్తున్న అత్యాధునిక మల్టీ డిజైనర్ స్టోర్ 'వియోనారా' బంజారాహిల్స్‌లో ప్రారంభమైంది. ఆన్లైన్ ఫ్యాషన్, ప్రత్యక్ష ఇన్-స్టోర్ షాపింగ్ అనుభవంతో ఏర్పాటైన ఈ ఎక్స్‌క్లూజివ్ స్టోర్ను తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా బోర్డు వైస్ చైర్పర్సన్ ఓ సీఎం ప్రజావాణి ఇన్చార్జ్ గద్వాల విజయలక్ష్మి, జెట్సెట్గో వ్యవస్థాపకురాలు, సీఈఓ కనికా టేక్రివాల్, ఫిక్కీ ఫ్లో జాతీయ వైస్ చైర్పర్సన్ కామిని సరాఫ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా వియోనారా వ్యవస్థాపకురాలు హృత్విఖ ఆర్ జైన్ మాట్లాడుతూ విలక్షణత, సరికొత్త శైలి, మూస పద్ధతులకు భిన్నమైన ఫ్యాషన్ను కోరుకునే వినియోగదారులకు ఇది ఒక ప్రత్యేక వేదికగా నిలుస్తుందన్నారు. షాపింగ్ అనుభవాన్ని మరింత మెరుగుపరిచేందుకు, వియోనారా ఇన్-స్టోర్ డిజిటల్ క్యాటలాగ్ను ఆన్లైన్తో అనుసంధానించిందన్నారు. దీని వల్ల డిజిటల్గా బ్రౌజ్ చేయడం, స్వయంగా స్టోర్లో కొనుగోలు చేయడం మధ్య ఒక సులభమైన సమన్వయం ఏర్పడుతుందని తెలిపారు. సమకాలీన లగ్జరీని, కాలాతీతమైన సౌందర్యాన్ని మేళవిస్తూ, బహుముఖ, విలక్షణమైన, ప్రత్యేక వేడుకలకు సరిపోయే ఫ్యాషన్ కోరుకునే కస్టమర్ల అభిరుచులను ఈ స్టోర్ తీరుస్తుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా వియోనారా వ్యవస్థాపకురాలు రేఖ కిమ్తీ మాట్లాడుతూ ఈ కలెక్షన్లలో వెస్టర్న్ వేర్, ఇండో-వెస్టర్న్ దుస్తులు, పండుగల స్పెషల్ ఎడిట్స్, మెన్స్వేర్‌తో పాటు యాక్సెసరీస్, లైఫ్స్టైల్ ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. లిమిటెడ్ ఎడిషన్ పండుగ కలెక్షన్లు, ప్రీమియం లుక్తో సరసమైన ధరల్లో లభించే వెండి ఆభరణాలు, బ్యాగులు, పాదరక్షలు, పెర్ఫ్యూమ్లు తదితర ఉత్పత్తులు కూడా ఈ స్టోర్లో కలవన్నారు. నగర ఫ్యాషన్ సంస్కృతి వేగంగా విస్తరిస్తున్న తరుణంలో, ప్రీమియం ప్రెట్ కలెక్షన్ల కోసం నగరవాసులు ఇతర మెట్రో నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగా డిజైనర్ ఫ్యాషన్ను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమన్నారు. డిజైనర్లకు అందుబాటు ధరల్లో ఆఫ్లైన్ వేదికను అందిస్తూ, కస్టమర్లకు ఆత్మవిశ్వాసంతో కూడిన షాపింగ్ అనుభవంతో.. సృజనాత్మకత, సమకాలీన జీవనశైలిల సంగమంగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా జెట్సెట్గో వ్యవస్థాపకురాలు, సీఈఓ కనికా టేక్రివాల్ మాట్లాడుతూ ఈ స్టోర్ అద్భుతమైన డిజైనర్ల కలెక్షన్ను ఒకచోటకు తెచ్చిందన్నారు. ఇందులో భారతీయ సంప్రదాయ దుస్తులు, పాశ్చాత్య దుస్తులు, పురుషుల వస్త్రాలు, పండగ ఫ్యాషన్ అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ నవరాత్రులలో ప్రత్యేకంగా, ఆకర్షణీయంగా కనిపించాలనుకుంటే షాపింగ్ చేయడానికి ఇది సరైన వేదికన్నారు.ఈ సందర్భంగా ఎఫ్ఐసీసీఐ ఎఫ్ఎల్ఓ జాతీయ ఉపాధ్యక్షురాలు కామిని సరాఫ్ మాట్లాడుతూ సాధారణ రెడీ-టు-వేర్ దుస్తుల నుంచి ప్రత్యేక కాస్ట్యూమ్ డిజైన్ల వరకు ఫ్యాషన్ ప్రియుల విభిన్న అభిరుచులను ఆకట్టుకునేలా వియోనారా అద్భుతమైన ఫ్యాషన్ శ్రేణిని అందిస్తుందన్నారు. విభిన్న శైలులు, డిజైన్లతో పండుగ ఫ్యాషన్ ప్రపంచాన్ని, అందరికీ సరిపోయే దుస్తులను ఒకే వేదిక కిందకు తీసుకొచ్చిందన్నారు.

# కేర్ హాస్పిటల్స్, హైటెక్ సిటీకి ప్రతిష్ఠాత్మక జెసిఐ అక్రిడిటేషన్



## రోగి భద్రత, వైద్య నాణ్యత, క్లినికల్ ఫలితాల్లో

## అంతర్జాతీయ ప్రమాణాలకు గుర్తింపు

హైదరాబాద్, అక్టోబర్ 12::కేర్ హాస్పిటల్స్, హైటెక్ సిటీ ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మక ఆరోగ్య సేవల గుర్తింపు సంస్థలలో ఒకటైన జాయింట్ కమిషన్ ఇంటర్నేషనల్ (జెసిఐ) నుంచి అక్రిడిటేషన్‌ను పొందింది. ఈ గుర్తింపుతో రోగి భద్రత, వైద్య నాణ్యత, క్లినికల్ ఎక్సలెన్స్ విషయంలో అంతర్జాతీయ ప్రమాణాలను అందుకుంటున్న కొద్దిమంది ఆసుపత్రుల జాబితాలో కేర్ హాస్పిటల్స్ స్థానం సంపాదించింది. ఈ అక్రిడిటేషన్ ద్వారా రోగులకు అత్యున్నత భద్రతా ప్రమాణాలు, మెరుగైన చికిత్సా ఫలితాలు, సంక్రమణ నియంత్రణలో కట్టుదిట్టమైన విధానాలు, మరియు ప్రపంచ స్థాయి ఉత్తమ వైద్య పద్ధతులకు అనుగుణంగా నాణ్యమైన ఆరోగ్య సేవలు అందుతున్నాయనే భరోసా లభిస్తుంది. ఆరోగ్య రంగంలో అత్యున్నత ప్రమాణంగా పరిగణించబడే జెసిఐ, రోగి సంరక్షణ, క్లినికల్ ప్రోటోకాల్స్, ఔషధాల నిర్వహణ, నాణ్యతా పరిపాలన, ఇన్ఫెక్షన్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్, రోగి భద్రత వంటి కీలక అంశాలపై కఠినమైన అంతర్జాతీయ ప్రమాణాల ఆధారంగా ఆసుపత్రులను మూల్యాంకనం చేస్తుంది. ఆసుపత్రి క్లినికల్ మరియు ఆపరేషనల్ విధానాలపై సమగ్ర సమీక్ష అనంతరం ఈ గుర్తింపు లభించింది. నాణ్యత, భద్రత, నిరంతర మెరుగుదలలను ప్రతి రోగి సేవలో భాగంగా నిలబెట్టేందుకు వైద్యులు, నర్సులు, కేర్‌గివర్లు, సపోర్ట్ సిబ్బంది చేసిన సమిష్టి కృషికి ఇది నిదర్శనంగా నిలుస్తుంది.ఈ సందర్భంగా కేర్ హాస్పిటల్స్ సీఈఓ డా. పవన్ కుమార్ మాట్లాడుతూ "రోగులు తమ జీవితంలో అత్యంత కీలకమైన సందర్భాల్లో మాపై విశ్వాసం ఉంచుతారు. కేర్ హాస్పిటల్స్, హైటెక్ సిటీలో ప్రతి రోగి సేవ వెనుక ఉన్న వ్యవస్థలు, ప్రక్రియలు, నాణ్యతా సంస్కృతి ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయని జెసిఐ అక్రిడిటేషన్ నిర్ధారిస్తోంది. అంతేకాకుండా, నిరంతర మెరుగుదల, ఆవిష్కరణలు, అత్యున్నత వైద్య సేవల అందించడంపై మా నిబద్ధతకు ఇది గుర్తింపు. భారతదేశంలోని ప్రముఖ ఆరోగ్య సేవల నెట్‌వర్క్‌లలో ఒకటిగా, క్లినికల్ ఎక్సలెన్స్, రోగి-కేంద్రిత సేవలు, మెరుగైన వైద్య ఫలితాల ద్వారా విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడంపై మా దృష్టి కొనసాగుతుంది" అని అన్నారు. నీలేష్ గుప్తా, రీజినల్ సీఈఓ, కేర్ హాస్పిటల్స్ మాట్లాడుతూ "ఈ విజయానికి మా వైద్యులు, నర్సులు, క్లినికల్ బృందాలు, సపోర్ట్ సిబ్బంది ఎన్నో సంవత్సరాలుగా చూపిన అంకితభావం, సమిష్టి కృషి కారణం. జెసిఐ అక్రిడిటేషన్ అనేది కేవలం మా ప్రక్రియలకు లభించిన గుర్తింపు మాత్రమే కాదు; ప్రతి రోజు సురక్షితమైన, సానుభూతితో కూడిన, ప్రపంచ స్థాయి వైద్య సేవలను అందించాలనే మా బృందం నిబద్ధతకు ప్రతిబింబం" అని పేర్కొన్నారు. ఈ మైలురాయి ద్వారా కేర్ హాస్పిటల్స్ అధునాతన ఆరోగ్య సేవల కోసం విశ్వసనీయ కేంద్రంగా తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంది. అలాగే దేశంలోనే అత్యంత విశ్వసనీయ ఆరోగ్య సేవల నెట్‌వర్క్‌ను నిర్మించే దిశగా మరో కీలక అడుగు వేసింది. ఈ విజయాన్ని పురస్కరించుకుని, కేర్ హాస్పిటల్స్ క్లినికల్ ఎక్సలెన్స్‌ను మరింత ముందుకు తీసుకెళ్లడం, రోగుల అనుభవాన్ని మెరుగుపరచడం, సురక్షితమైన, విశ్వసనీయమైన, నాణ్యమైన ఆరోగ్య సేవలను సమాజానికి అందుబాటులో ఉంచడం పట్ల తన నిబద్ధతను మరోసారి పునరుద్ఘాటిస్తోంది.





# మట్టి దందా... 'ఆదిభట్ల'లో ఆగదా

- ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆదేశాలు బేకాతర్
- పట్టని రెవెన్యూ, మైనింగ్ అధికారులు
- కన్వెన్షన్ హాల్ కేంద్రంగా వందల టిప్పర్లల్లో యథేచ్ఛగా అక్రమ రవాణా

**రంగారెడ్డి, అక్టోబర్ 12 (జనం సాక్షి) :** ఆదిభట్ల పరిధిలో అక్రమ మట్టి వ్యాపారం యదెచ్ఛగా సాగుతున్నా.. ఇటీవల ఎమ్మెల్యే హెచ్చరించినా మట్టి మాఫియా తీరు మారడం లేదు. 'రోడ్డుపై ఒక్క మట్టి టిప్పర్ కనిపించినా కేసులు నమోదు చేయాలి' అని ఎమ్మెల్యే కఠిన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, అక్రమార్కులు ఆ ఆదేశాలను తుంగలో తొక్కి తమ దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు.

**ఆదిభట్ల నుంచి కొంగరకలాన్ కు మట్టి..**

ఆదిభట్లలోని ఒక ప్రముఖ కన్వెన్షన్ హాల్ ప్రాంగణమే కేంద్రంగా ఈ అక్రమ మట్టి తవ్వకాలు శరవేగంగా జరుగుతున్నాయి. పట్టపగలే టిప్పర్ల ద్వారా ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నారు. కన్వెన్షన్ హాల్ నుండి కొంగరకలాన్‌లోని ఒక ప్రైవేట్ పాఠశాల ప్రాంగణానికి, అలాగే చుట్టుపక్కల ఉన్న ఇతర కమర్షియల్ వెంచర్లకు ఈ మట్టిని విక్రయిస్తూ అక్రమార్కులు రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు.

**అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు..**

ఇటీవల అక్రమ మట్టి విక్రయాలు, తవ్వకాలపై తీవ్రంగా స్పందించిన స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, రెవెన్యూ, మైనింగ్ అధికారుల పనితీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అయినప్పటికీ స్థానిక అధికారులు మాత్రం తమకేమీ తెలియనట్లు, కళ్లముందే మట్టి టిప్పర్లు తిరుగుతున్నా పట్టించుకోకపోవడం వెనుక పెద్ద ఎత్తున 'మామూళ్ల' హస్తం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ప్రభుత్వ ఆదాయానికి గండి..**

రెవెన్యూ మైనింగ్ శాఖ నుంచి ఇలాంటి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. కన్వెన్షన్ హాల్ పేరుతో అనుమతులు తీసుకున్న యాజమాన్యం అంతర్గత మట్టి దిబ్బల తొలగింపుకు అనుమతులు తీసుకుంటుంది. కానీ అందులో నుంచి మట్టినీ ఇతర ప్రాంతాలకు తరలించేందుకు అనుమతి లేదు. అయినా కన్వెన్షన్ హాలు ప్రాంగణంలోని మట్టిదిబ్బలను వందల మట్టిని టిప్పర్ల ద్వారా బయటికి తరలిస్తున్నారు. మట్టి వ్యాపారులతో కుమ్మక్కై పెద్ద పెద్ద గోతులు పెడుతూ అక్రమాలకు పాల్పడుతున్నారు. కేవలం కన్వెన్షన్ వ్యాపారమే కాకుండా మట్టి వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారన్న విమర్శలున్నాయి. దాంతో ప్రభుత్వ ఆదాయానికి భారీ గండిపడుతోంది.

## అవినీతిపరులకు అండ.. పార్టీకే గండం!

ఆరోపణలపై పార్టీ స్పందన వంటి అంశాలు ఎన్నికల వేళ కీలకంగా మారే అవకాశం ఉంది. ప్రతి ఐదేళ్లకోసారి ఎమ్మెల్యేలు మారడానికి ఒక్క కారణమే ఉంటుందని చెప్పలేం. అయినప్పటికీ, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోలేకపోవడం రాజకీయ పార్టీల విజయావకాశాలను దెబ్బతీసే అంశమే.

పార్టీ నాయకత్వం ప్రజల్లో మంచి పేరు ఉన్నవారిని ప్రోత్సహిస్తూ, ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి వ్యవహారాలపై నిష్పక్షపాతంగా స్పందించాలి. వ్యక్తిగత విధేయతకు ప్రాధాన్యమిచ్చి ప్రజాభిప్రాయాన్ని నిర్లక్ష్యం చేస్తే, పార్టీ చేసిన అభివృద్ధి పనులకు కూడా ఆశించిన గుర్తింపు లభించకపోవచ్చు. యాలాల మండలంలోనే కాకుండా ఏ ప్రాంతంలోనైనా ప్రజల విశ్వాసమే రాజకీయ నాయకులకు అసలైన పెట్టుబడి. ఆ విశ్వాసాన్ని కాపాడుకోవాలంటే అభివృద్ధి పనులతోపాటు పారదర్శకతకు పెద్దపీట వేయాలి. వ్యక్తులను కాపాడుతున్నారనే భావన కలిగించకుండా, ప్రజల ప్రయోజనాలకే ప్రాధాన్యమిచ్చేలా వ్యవహరించాలి.

## బేబీ ఆరేలియాకు నివాళిగా కొవ్వొత్తుల ర్యాలీ



**అల్వాల్, అక్టోబరు 12 (జనంసాక్షి):** కౌకూర్‌లోని విల్లా ఆర్కిడ్స్ గేటెడ్ కమ్యూనిటీలో ఐదేళ్ల చిన్నారి ఆరేలియా మృతికి సంతాపంగా నివాసితులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. చిన్నారి చిత్రపటం ఎదుట కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. చేతుల్లో కొవ్వొత్తులు పట్టుకుని ర్యాలీలో పాల్గొన్న కాలనీ వాసులు చిన్నారి మృతిపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనకు బాధ్యులైన వారికి చట్టప్రకారం శిక్ష పడాలని, చిన్నారి కుటుంబానికి న్యాయం జరగాలని ఆకాంక్షించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గేటెడ్ కమ్యూనిటీల్లో పిల్లల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని, భద్రతా చర్యలను మరింత పటిష్ఠం చేయాలని అభిప్రాయపడ్డారు.

## తాగునీటిపై అందరం కృషి చేద్దాం

**బాకారం సర్పంచ్ ఎలిగని వెంకటేష్ గౌడ్**



**మొయినాబాద్, అక్టోబర్ 12, జనంసాక్షి:** ఎల్నినో ప్రభావంతో వర్షాలు కురవకపోవడం మూలానా తాగునీటి సమస్య తలెత్తకుండా గ్రామ పంచాయతీ ద్వారా అందరం కృషి చేద్దామని బాకారం సర్పంచ్ ఎలిగని వెంకటేష్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని బాకారం గ్రామ పంచాయతీ ఆవరణలో గ్రామ సభనునిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ద్వారా ప్రజలకు నీటి ఎద్దడి రాకుండా అందరం కృషి చేద్దామన్నారు. గ్రామ ప్రజలు తాగునీటిపై శ్రద్ధ వహించి వృదా చేయవద్దని పేర్కొన్నారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు నిర్మించుకుంటే భూగర్భ జలాలను కాపాడుకున్నట్లు అవుతామని పేర్కొన్నారు. పారిశుధ్య కార్యక్రమాలలో పంచాయతీ సిబ్బందిచే పరిసరాల పరిశుభ్రత పనులు నిర్వహించేలా కృషి చేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతోనే క్రిమికీటకాలు, దోమలు, ఈగలు రావని పేర్కొన్నారు. వర్షాలు సంవృద్ధిగా లేకపోవడంతో దోమల బెడద పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

**రాజేంద్రనగర్,అక్టోబర్12(జనంసాక్షి) :** రాజేంద్రనగర్: పత్తికుంట వద్ద బతుకమ్మ వేడుకలు, నిమజ్జనానికి అవసరమైన నీరు, లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరుతూ జోనల్ కమిషనర్ కె. శ్రీనివాస్ రెడ్డికి బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. దేవీ నవరాత్రుల సందర్భంగా బస్తీల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాల నిమజ్జనానికి క్రేన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వై. శ్రీధర్, ఎం. కొమురయ్య, ఎస్. జయానంద్ రెడ్డి, సులిగే వెంకటేష్, ఈ. వేణుగోపాల్ పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులకు వెంటనే పరిష్కారం

**ఎంపీడీవో రాములు**

బంట్వారం అక్టోబర్ 12 జనం సాక్షి బంట్వారం మండలంలో ప్రజావాణికి వచ్చే సమస్యలను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా శాఖల వారీగా పరిశీలించి పరిష్కరించాలని బంట్వారం మండల ఎంపీడీవో ఆదేశించారు. సోమవారం అధికారులతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. సమస్యలను వెంటనే పరిష్కరించి ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు

## 15 ఏళ్లుగా తాళాలకే పరిమితమైన సమావేశ మందిరం

**ప్రజాధనం వృథా.. ప్రజలకు అందని సేవలు**

**నిర్మాణం పూర్తయినా వినియోగంలోకి రాని భవనం**

బంట్వారం, అక్టోబర్ 9 (జనంసాక్షి): ప్రజలకు, ప్రజాప్రతినిధులకు ఉపయోగపడేలా నిర్మించిన ప్రభుత్వ సమావేశ మందిరం సుమారు 15 ఏళ్లుగా నిరుపయోగంగా ఉండటంపై బంట్వారం మండల కేంద్రంలోని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2011లో అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులు, శ్రీమతి పట్నం మనీతా మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మీటింగ్ హాల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నిర్మాణం పూర్తయినప్పటికీ నేటికీ పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాకపోవడంతో ప్రభుత్వ నిధులతో నిర్మించిన భవనం లక్ష్యం నెరవేరడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు.ప్రజా సమస్యలపై సమావేశాలు, గ్రామాభివృద్ధి కార్యక్రమాలు, అధికారిక సమావేశాలు నిర్వహించేందుకు ఉపయోగపడాల్సిన భవనం ఏళ్ల తరబడి తాళాలకే పరిమితం కావడంతో నిర్వహణ లోపించి పరిసరాలు సైతం నిర్లక్ష్యానికి గురవుతున్నాయని వారు తెలిపారు. ప్రజల అవసరాల కోసం నిర్మించిన భవనం అందుబాటులో లేకపోవడం విచారకరమని పేర్కొన్నారు.

సంబంధిత అధికారులు సమావేశ మందిరాన్ని పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టడంతోపాటు విద్యుత్, తాగునీరు, ఫర్నిచర్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని భవనాన్ని వెంటనే వినియోగంలోకి తీసుకువచ్చి ప్రజా సమావేశాలు, గ్రామాభివృద్ధి కార్యక్రమాలకు అందుబాటులోకి తేవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## చందానగర్ వార్డులో స్థానిక సమస్యలను పరిష్కరించండి

**మియాపూర్ సర్కిల్ డిసికి సిపిఎం వినతి**



**శేరిలింగంపల్లి, అక్టోబర్ 12 (జనంసాక్షి) :** మియాపూర్ సర్కిల్ చందానగర్ డివిజన్ పరిధిలో నెలకొన్న స్థానిక సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం మియాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ కు పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆపార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్ మాట్లాడుతూ మియాపూర్ సర్కిల్ పరిధిలోని తారా నగర్ లో ఉన్న హిందూ స్మశాన వాటికలో కనీస వసతులకు కొరత ఉండటం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే మానవతా దృక్పథంతో అన్ని మౌలిక వసతులను కల్పించాలని ఆయన స్పష్టం చేశారు. తారా నగర్ ప్రాంతంలో ఎక్కడ చూసినా సమస్యలు తాండవిస్తున్నాయని, బాధ్యత కలిగిన అధికారులుగా ఆ ప్రాంతాన్ని పరిశీలించి స్థానికంగా నెలకొన్న ఇతర సమస్యలు పరిష్కరించాలని జగదీష్ తదితరులు డిసి ని కోరారు. కాలనీ రోడ్లన్నీ పూర్తిగా ధ్వంసం అయ్యాయని, రహదారి వెంబడి విపరీతమైన ట్రాఫిక్ జామ్ ఏర్పడి వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన వినతిపత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. తాగునీటి సరఫరా టైమును పెంచాలని, డ్రైనేజీలు ఎప్పటికప్పుడు శుభ్రంచేసే విషయంలో తీవ్ర ఆలస్యం జరుగుతుందని, డ్రైనేజీ విభాగం కార్మికులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో సమస్య తీవ్ర జటిలంగా మారుతుందని జగదీష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కొంగర కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 54 ఫిర్యాదులు

- అర్జీల పరిష్కారంపై సీఎంసీ కమిషనర్ డాక్టర్ జి. సృజన ఆదేశాలు
- టౌన్ ప్లానింగ్ విభాగానికి 40 ఫిర్యాదులు
- ప్రతి అర్జీకి ప్రత్యేక గ్రీవెన్స్ ఐడీ, ట్రాకింగ్ లింక్
- పారదర్శకంగా, గడువులోగా పరిష్కరించాలని సూచన



**శేరిలింగంపల్లి, అక్టోబర్ 12 (జనంసాక్షి):** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) పరిధిలో ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను ప్రాధాన్యత క్రమంలో పరిశీలించి, సకాలంలో పరిష్కరించాలని కమిషనర్, సీనియర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ జి. సృజన అధికారులను ఆదేశించారు. సోమవారం సీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆమె ప్రజల నుంచి 54 ఫిర్యాదులను స్వీకరించారు.

వీటిలో టౌన్ ప్లానింగ్ విభాగానికి 40, ఇంజినీరింగ్‌కు 6, రెవెన్యూ (ఆస్తిపన్ను) విభాగానికి 2, అర్బన్ బయోడైవర్సిటీకి ఒకటి, అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్‌కు ఒకటి, ఎలక్ట్రికల్ విభాగానికి ఒకటి, ఇతర విభాగాలకు మూడు ఫిర్యాదులు అందాయి. ప్రతి ఫిర్యాదుకు ప్రత్యేక గ్రీవెన్స్ ఐడీ, ట్రాకింగ్ లింక్ కేటాయించినట్లు అధికారులు తెలిపారు. వీటి ద్వారా ఫిర్యాదుల పరిష్కార స్థితిని ప్రజలు తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.ప్రజల సమస్యలను బాధ్యతగా స్వీకరించి, అవసరమైన చర్యలు చేపట్టాలని కమిషనర్ సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా పర్యవేక్షించాలని, పరిష్కారంలో జాప్యం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా కార్పొరేషన్ దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రజావాణి వేదికగా ఉపయోగపడుతోందని ఆమె తెలిపారు.